J/Nellore/003/2018-20 R.N.I.No.25359/74
నెల్లూరు, 19.06.2020, శుక్రవారం సంపుటి : 40 సంచిక : 03 పేజీలు : 12, వెల : ₹ 5





# లాయర్

వ్యవస్థాపకులు : తుంగా రాజగోపాలరెడ్డి సంగ్రాహకులు : తుంగా శివప్రభాత్‌రెడ్డి
www.lawyerteluguweekly.com

● మొదలైంది వేట...

# ఇక..ఆగదు ఆట



- మొదటి వికెట్‌గా అచ్చెన్న, రెండో వికెట్‌గా జేసీ బ్రదర్స్
- సాక్ష్యాధారాలతో చట్టబద్ధంగా బోనులోకి
- జగన్ దెబ్బకు బాబు గుండెల్లో కల్లోలం రేగుతోంది

**నోరు మంచిదైతే... ఊరు మంచిదవుతుందంటారు. అధికారం చేతిలో ఉన్నప్పుడు, అహంకారం తలకెక్కినప్పుడు నోరు అదుపులో వుండదు... నోటికేదొస్తే అలా మాట్లాడేయడమే... కాని, ఇలాంటి వారికి కాలమే సమాధానం చెబుతుంది. పరిస్థితులే శిక్షలు వేస్తాయి. అలాంటి సమయంలో వారిపట్ల కనీస జాలి, దయ చూపించేవాళ్ళు కూడా మిగలరు. ప్రస్తుతం రాష్ట్ర రాజకీయాలలో అలాంటి పరిస్థితినే ఎదుర్కొంటున్నారు మాజీమంత్రి అచ్చెన్నాయుడు, మాజీ ఎంపీ, మాజీ ఎమ్మెల్యేలైన జేసీ సోదరులు.**

2014–19ల మధ్య తెలుగుదేశం ప్రభుత్వంలో జరిగిన 151 కోట్ల ఇఎస్ఐ కుంభకోణానికి సంబంధించి అప్పటి కార్మిక శాఖ మంత్రిగా పనిచేసిన ప్రస్తుత శాసన సభ ప్రతిపక్ష ఉపనాయకుడు కింజారపు అచ్చెన్నాయుడును అవినీతి నిరోధక శాఖ అధికారులు అరెస్ట్‌చేసి కోర్టుకు పెట్టడం, న్యాయమూర్తి రిమాండ్‌కు ఆదేశించడం చకచక జరిగిపోయాయి.


గత ప్రభుత్వంలో ఇఎస్ఐలో జరిగిన అవినీతి ఆనవాళ్ళకు పక్కా ఆధారాలతోనే ఏసిబి వేట మొదలు పెట్టింది. ఆనాడు ఈ కుంభకోణంలో కీలకపాత్ర పోషించిన మరికొందరు అధికారులను కూడా అరెస్ట్ చేయడం జరిగింది. ఇదే క్రమంలో అక్రమంగా బస్సుల రిజిస్ట్రేషన్, బిఎస్3 వాహనాలను బిఎస్ 4గా చెప్పి రిజిస్ట్రేషన్ చేయడం, లారీలను బస్సులుగా మార్చి ప్రయాణికుల రూట్లలో తిప్పడం వంటి ఎన్నో అక్రమాలకు సంబంధించి దివాకర్ ట్రావెల్స్ అధినేతలు మాజీ ఎమ్మెల్యే జేసీ ప్రభాకర్‌రెడ్డిని, ఆయన కొడుకు అస్మిత్ రెడ్డిని పోలీసులు అరెస్ట్ చేయడం, రిమాండ్‌కు పంపడం కూడా అయ్యింది.

## సానుభూతి కూడా లేదు

అచ్చెన్నాయుడు, జేసీ ప్రభాకర్‌రెడ్డిల అరెస్ట్ విషయంలో తెలుగుదేశం నాయకులు ఏదో మాట్లాడుతున్నారు గాని, సాధారణ ప్రజల్లో వీరిద్దరి అరెస్ట్ పట్ల ఎలాంటి వ్యతిరేకతా లేదు, సరికదా తెలుగుదేశం ప్రభుత్వంలో వీళ్ళు చేసిన ప్రేలాపనలకు తగిన శాస్తే జరిగిందంటున్నారు. చేసిన పాపాలు పండే.. వాళ్ళు జైలుకు పోయారని, వీళ్ళ పట్ల సానుభూతి చూపాల్సిన అవసరం లేదనేది జనాభిప్రాయం. గత పదేళ్లుగా తెలుగుదేశం నాయకులు వైయస్ జగన్మోహన్‌రెడ్డిపై ఎన్నో నిందలు వేస్తూ వచ్చారు. ముఖ్యంగా గత తెలుగుదేశం ప్రభుత్వంలో అయితే శాసన సభ సమావేశాలలో అచ్చెన్నాయుడు, దేవినేని ఉమామహేశ్వరరావు, బోండా ఉమ, యరపతినేని శ్రీనివాసరావు లాంటోళ్ళు సంస్కారం, సభ్యత మరచి జగన్‌పై నోటికొచ్చినట్లు వాగారు.

ఇక కృష్ణాజిల్లాలో దివాకర్ ట్రావెల్స్‌కు సంబంధించిన (మిగతా 11వ పేజీలో)




## మూడు రాజధానులపై...

# ముందుకే..!

- మరోసారి అసెంబ్లీలోకి బిల్లు
- పరిపాలన రాజధానికి బడ్జెట్‌లో నిధులు

**అభివృద్ధి వికేంద్రీకరణే లక్ష్యంగా చేసుకుని రాష్ట్రానికి మూడు రాజధానులను ఏర్పాటు చేయాలన్న తన ఉక్కు సంకల్పంపై ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్‌రెడ్డి ఏ మాత్రం రాజీపడడం లేదు.**

చారిత్రాత్మక అనుభవాలను దృష్టిలో పెట్టుకుని, 2014 రాష్ట్ర విభజన లాంటి పరిస్థితి రాష్ట్రంలో మరోసారి రాకూడదని వైయస్ జగన్మోహన్‌రెడ్డి మూడు రాజధానుల ప్రతిపాదనను తీసుకురావడం తెలిసిందే! విశాఖపట్నంను పరిపాలనా రాజధానిగా, అమరావతిని శాసన రాజధానిగా, కర్నూలును న్యాయపాలనా రాజధానిగా మారుస్తూ సిఆర్‌డిఏను రద్దు చేస్తూ సంబంధిత బిల్లులను గత ఏడాది శీతాకాల సమావేశాలలో అసెంబ్లీలో ఆమోదించడం తెలిసిందే! అయితే ఇదే బిల్లును శాసనమండలికి పంపిన తరుణంలో మండలి ఛైర్మెన్ స్థానంలో వున్న తెలుగుదేశం ఎమ్మెల్సీ ఎం.ఏ.షరీఫ్ తనకున్న విచక్షణాధికారంతో బిల్లును సెలక్ట్ కమిటీకి పంపి, దొడ్డిదారిన చంద్రబాబు కుయుక్తులకు మద్దతు తెలిపాడు. ప్రజలు ఎన్నుకున్న సభ్యులతో కూడిన శాసనసభ ఆమోదించిన (మిగతా 11వ పేజీలో)



# జిల్లాలో కరోనా విజృంభణ

## 511కి చేరిన కరోనా కేసులు

జిల్లాలో కరోనా మహమ్మారి వ్యాధి నానాటికీ విజృంభిస్తూనే ఉంది. ఈనెల 17వ తేది నాటికి జిల్లాలో నమోదైన కరోనా పాజిటివ్ కేసుల సంఖ్య 511కి చేరుకోవడం అందరినీ ఆందోళనకు గురి చేస్తోంది. జిల్లా అధికారులు పెద్దఎత్తున కరోనా నివారణకు చర్యలు తీసుకుంటున్న నేపథ్యంలో కరోనా వైరస్ బారినపడి కోలుకుంటున్న వారి సంఖ్య కూడా ఆశా జనకంగా ఉండడంతో కొంతలో కొంత ఊరట కలుగుతోంది. ఈనెల 17 ఒక్క రోజునే 53 కేసులు నమోదు కావడంతో అధికారులు, ప్రజలు తీవ్ర ఆందోళనకు గురయ్యారు. అందులోనూ జిల్లా కేంద్ర మైన నెల్లూరు నగరంలోనే అధికసంఖ్యలో కేసులు నమోదు కావడంతో వెంటనే అప్రమత్తమై అధికారులు ఆ వ్యాధి వ్యాప్తి చెందకుండా తక్షణ చర్యలు తీసుకుం టున్నారు. కరోనా వైరస్ వచ్చిన 53 మందిలో నలుగురు ఇతర ప్రాంతాల వారుగా ఉన్నట్లు గుర్తించారు. వీరు తమ స్వస్థలమైన పుణేకి వెళ్ళిపోగా మిగిలిన 49 మందికి తగు వైద్యసేవలందిస్తున్నారు. 19 మంది ఈ వైరస్ బారి నుంచి కోలు కుని ఈనెల 17న తిరిగి ఇళ్ళకు వెళ్ళిపో యారు. మొత్తం 511 కేసుల్లో దశల వారీగా ఇప్పటికి 310 మంది కోలుకుని డిశ్చార్జ్ అయ్యారు. 8మంది మరణించారు. మిగిలినవారు నగరంలోని నారాయణ, పెద్దాసుపత్రుల్లోని ఐసొలేషన్‌వార్డుల్లో చికిత్స పొందుతున్నారు.

ఇదిలా ఉంటే జిల్లా పోలీస్ కార్యా లయంలో పనిచేస్తున్న ఓ ఆర్ఎస్ఐకి కూడా కరోనా పాజిటివ్ రావడంతో పోలీసువర్గాల్లో కలకలం రేకెత్తింది. దీంతో జిల్లాలోని అన్ని పోలీస్‌స్టేషన్ల సిబ్బందికి కరోనా పరీక్షలు చేయిస్తున్నారు.

### ముంగమూరు ఎయిడ్స్ కేంద్రంలో

# ముస్లిం యూత్ అన్నదానం



నెల్లూరుజిల్లా బోగోలు మండలం, ముంగమూరులోని భవానీ ఎయిడ్స్ బాధితుల ఆదరణ కేంద్రంలో ముస్లిం యూత్ సేవా సంస్థ అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించింది. వైఎస్ఆర్ కాంగ్రెస్ సేవా దళ్ నేత షేక్ మీరా మొహిద్దీన్ సహకారంతో ముస్లిం యూత్ సంస్థ అధ్యక్షులు ఎస్.కె. ఖాలిద్ ఈ కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా ఎస్.కె. ఖాలిద్ మాట్లాడుతూ ముస్లిం యూత్ ద్వారా ఎన్నో సేవా కార్యక్రమాలు చేపడుతున్నామని అన్నారు. ఈ ఎయిడ్స్ ఆదరణ కేంద్రంలో అనేక మార్లు సేవా కార్యక్రమాలు చేపట్టినట్లు గుర్తుచేశారు. ఈ కార్యక్రమంలో సోహైల్, జాకీర్, కాలేషా, బర్కతుల్లా పాల్గొన్నారు.

## వృద్ధాశ్రమ స్థలాన్ని పరిశీలించిన ట్రైనీ కలెక్టర్

కొడవలూరు మండలంలోని గౌతమ్ నగర్ మజరా అశోక్ నగర్‌లో వృద్ధాశ్రమ ప్రతిపాదిత స్థలాన్ని ట్రైనీ కలెక్టర్ భావన వశిష్ట ఈనెల 15న పరిశీలించారు. ఇక్కడ ప్రభుత్వ భూమి 30సెంట్లు వుండగా, ఆ భూమిని కేటాయిస్తే వృద్ధాశ్రమం నడుపుకుంటామని, ఆ స్థలానికి బదులుగా చిల్లకూరు మండలంలోని 50 సెంట్ల భూమిని ప్రభుత్వానికి ఇస్తామని కొందరు జిల్లా కలెక్టర్‌కు అర్జీ పెట్టుకున్నారు. కలెక్టర్ ఆదేశాలపై స్థలాన్ని ఈనెల 15న పరిశీలించిన ట్రైనీ కలెక్టర్ ఆ భూమికి సంబం ధించిన రికార్డులన్నీ పరిశీలించి, పంపిణీకి అర్హమైన స్థలమేనా కాదా అని నివేదిక పంపాలని తహసీల్దార్ లాజరస్‌ను ఆదేశించారు. సర్వేయర్ కామేశ్వరరావు, ఆర్ఐ మల్లిఖార్జున, సిబ్బంది ఉన్నారు.

### వైయస్సార్సీపీ ఘన విజయానికి..

# మొక్కు తీర్చేందుకు పాదయాత్ర

గత ఎన్నికల్లో వైయస్సార్ సీపీ ఘన విజయం సాధించినందుకు ఆత్మకూరు మండలం చేజర్ల శివాలయం నుండి ప్రకాశం జిల్లా మాలకొండ లక్ష్మీ నరశింహస్వామి ఆలయం వరకు పాదయాత్ర చేసి తమ మొక్కు చెల్లించుకుంటున్నామని వైయస్సార్‌సీపీ నాయకుడు, జిల్లా పార్టీ అధికార ప్రతినిధి పూనూరు రామమనోహర్‌రెడ్డి తెలిపారు. ఈనెల 15న వారు పాదయాత్రను ప్రారంభించారు. శివాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం ప్రధాన వీధిలోని వైయస్సార్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘన నివాళు లర్పించారు. వైయస్సార్ సీపి మండల పార్టీ కన్వీనర్ తూమాటి విజయభాస్కర్ రెడ్డి, జిల్లా పార్టీ ప్రధాన కార్యదర్శి బాలిరెడ్డి సుధాకర్ రెడ్డి, జడ్పీటీసీ అభ్యర్థి పేర్ల పార్థసారధి, వీర రాఘవరెడ్డి, రఘురాంరెడ్డి, సిరాజుద్దీన్, పెంచల నరసయ్య, ఎ.గణేష్, కాలేషా, రాంబాబు, సి.రాజు, శేఖర్, ఈశ్వర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# అక్రమ ఇసుక స్వాధీనం

నెల్లూరు ఏ.కె.నగర్‌లోని ఇండస్ట్రియల్ ఎస్టేట్‌లో అక్రమంగా నిల్వవుంచిన ఇసుక డంప్‌ను ఎస్ఇబి అధికారులు గుర్తించారు. ఎస్ఇబి డిప్యూటీ కమిషనర్ రాధయ్య ఆదేశాలతో ఆ శాఖ అధికారులు శ్రీనివాసరావు, నెల్లూరు 1వ టౌన్‌స్టేషన్ ఇన్‌ఛార్జ్ అశోక్‌కుమార్‌లు ఆ డంప్‌పై దాడి చేసి నాలుగు టన్నుల ఇసుకను తరలిస్తున్న ట్రాక్టర్‌ను పట్టుకుని డ్రైవర్‌ను అదుపులోకి తీసుకుని కేసు విచారణ చేస్తున్నారు.

# దారి మళ్ళుతున్న రేషన్ బియ్యం..



కరోనా వైరస్ నేపథ్యంలో మధ్యాహ్న భోజనం కోసం విద్యా ర్థుల ఇళ్ళకు పంపిణీ చేసే రేషన్ బియ్యం దారి మళ్ళుతోంది. ఎంఎల్ఎస్ పాయింట్లు, డీలర్ల నుంచే కాకుండా ఏకంగా గ్రామాల్లోను బియ్యం సేకరణకు అక్రమార్కులు ముఠాలను ఏర్పాటు చేశారు. వీటితో పాటు ఇతర జిల్లాల నుంచి సేకరించిన బియ్యాన్ని జిల్లాలోని పలు రైస్ మిల్లుల్లో పాలిష్ పెట్టి విక్రయిస్తున్నారు. ప్రభుత్వం రాయితీపై ఒక్క రూపాయికి అందజేసే బియ్యాన్ని రీసైక్లింగ్ చేసి కిలో రూ. 40 చొప్పున విక్రయిస్తున్నారు. లాక్ డౌన్ సమయంలో నిత్యావసర సరుకుల రవాణాకు ప్రభుత్వం అనుమతి ఇవ్వడంతో రేషన్ బియ్యం రవాణా గుట్టుచప్పుడు కాకుండా సాగించారు. కరోనా విపత్తు కాలంలో పేద వర్గాలకు ప్రభుత్వం ఉచితంగా బియ్యం, పప్పులు పంపిణీ చేసింది. ఇదే అదనుగా తీసుకున్న అక్రమార్కులు ఆ బియ్యాన్ని సేకరించి రవాణా చేశారు. ఇటీవల విజిలెన్స్, పోలీసులు జరిపిన దాడుల్లో అక్రమ రవాణా గుట్టు రట్టు అయింది. కొందరు అక్రమార్కులు రేషన్ డీలర్లు, ఎంఎల్ ఎస్ పాయింట్ల వద్ద నుంచే కాకుండా తక్కువ ధరకు బియ్యాన్ని సేకరించి అన్నింటిని ఓ చోటకు చేర్చి రైస్ మిల్లులకు పంపి అక్కడే రీసైకిలింగ్ చేసి ఇతర రాష్ట్రాలతో పాటు జిల్లాలోను విక్రయాలు చేసి సొమ్ము చేసుకుంటున్నట్లు సమాచారం. రేషన్ బియ్యం అవసరం లేని వారివద్ద నుంచి తక్కువ ధరకు సేకరించి కిలో బియ్యం రూ.15 వంతున అక్రమార్కులు విక్రయాలు చేస్తు న్నారు. అనంతరం రైస్ మిల్లులో రీసైక్లింగ్ చేసి బ్రాండెడ్ కంపెనీలకు చెందిన బ్యాగుల్లో నింపి జిల్లాతో పాటు బెంగు ళూరు, చెన్నైకు తరలించి విక్రయించి సొమ్ము చేసుకుంటున్నారన్న విమర్శలు వినవస్తున్నాయి. జిల్లా కేంద్రంలో దాదాపు 10 మందికి పైగానే వ్యాపారులు ఈ తరహా వ్యాపారం చేస్తున్నట్లు సమాచారం.

# పదో తరగతి పరీక్షలకు ఐసోలేషన్ గదులు

పదో తరగతి పరీక్షల నిర్వహణకు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక జాగ్రత్తలు తీసుకుంటోంది. ప్రతి పరీక్షా కేంద్రంలో ఐసోలేషన్ గది ఏర్పాటు చేయాలని పరీక్షల విభాగం డైరెక్టర్ సుబ్బారెడ్డి ఆదేశించారు. జలుబు, దగ్గు, జ్వరం ఉన్న విద్యార్థులతో ఆ గదిలో పరీక్షలు రాయించాలని సూచించారు. కరోనా వైరస్ నేపథ్యంలో పది పరీక్షల్లో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ఈనెల 13న మార్గదర్శకాలను జిల్లా విద్యాశాఖ కార్యాలయాలకు పంపించారు. పదీ పరీక్షలు జూలై 10 నుంచి 17వ తేదీ వరకు నిర్వహించనున్నారు. ఈ పరీక్షలకు జిల్లాలో 38,179 మంది విద్యార్థులు హాజరుకానున్నారు. పరీక్షల నిర్వహణకు జిల్లాలో 281 కేంద్రాలను ఏర్పాటు చేయనున్నారు. ఒక్కో గదిలో 10 నుంచి 12 మంది విద్యార్థులు ఉండి పరీక్షలు రాసే విధంగా చర్యలు తీసుకున్నారు. పరీక్షలు నిర్వహిస్తున్న కేంద్రాలు ఉన్న ప్రాంతాల్లో కోవిడ్-19 కేసులు నమోదైతే వేరే ప్రాంతాల్లో పరీక్షలు నిర్వహించేందుకు అధికారులు చర్యలు చేపట్టారు. ప్రస్తుత పరీక్ష కేంద్రాలకు అదనంగా డివిజన్ కు మరో 10 చొప్పున జిల్లాలో 30 పరీక్ష కేంద్రాలను సిద్ధం చేశారు. ఈ క్రమంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు గురించి వివరించారు.

# ప్రభుత్వ ఉద్యోగులకు రోటరీక్లబ్ శానిటైజర్లు

కోట మండలంలోని అన్ని ప్రభుత్వ కార్యాలయాలకు ఈనెల 12న కోట పట్టణంలోని రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో శానిటైజర్లు, మాస్కులు పంపిణీ చేశారు. రోటరీ క్లబ్ ఛైర్మన్ పెల్లేటి గోపాల్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి పెల్లేటి కిషోర్, రోటరీ క్లబ్ కమిటీ సభ్యులు ఈ వితరణ చేశారు. తహశీల్దార్ కార్యాలయంలో జరిగిన ఈ కార్యక్రమంలో తొలుత తహశీల్దార్ మల్లికార్జునరావు చేతుల మీదుగా రోటరీక్లబ్ వారు ఈ మాస్కులు, శానిటైజర్లను పంపిణీ చేయించారు. అనంతరం మండల పరిషత్, పోలీస్‌స్టేషన్, ఆర్అండ్‌బి, ఇతర శాఖల అధికారులు, ఉద్యోగులకు వాటిని పంపిణీ చేసి తమ సేవాభావం చాటుకున్నారు.

# కన్నతల్లినే కడతేర్చాడు..

నవమాసాలు మోసి కని, పెంచిన కన్నతల్లినే కడతేర్చాడు ఓ కిరాతకుడు. నెల్లూరు జిల్లా, చేజర్ల మండలం, తూర్పు కంభంపాడులో ఈ దురదృష్టకర సంఘటన జరిగింది. ఈ మేరకు ఈనెల 15 న నెల్లూరు రూరల్ డీఎస్పీ హరినాథ్ రెడ్డి వివరాలను స్థానిక పోలీస్ స్టేషన్ లో వెల్లడించారు. తూర్పు కంభంపాడు గ్రామానికి చెందిన తలపల రమణయ్య, భార్య రమణమ్మ, పెద్ద కొడుకు చెంచురామయ్య, రెండో కొడుకు వెంకటేశ్వర్లు అతని భార్య విజయమ్మలు ఐదు నెలలుగా బాతులు మేపుతూ జీవనం సాగిస్తున్నారు. వీరందరికి మద్యం అలవాటు వుంది. మద్యం మత్తులో చెంచురామయ్య తన మరదలిని లైంగికంగా వేధించడం మొదలుపెట్టాడు. దీంతో అన్నదమ్ముల మధ్య గొడవలు మొదలయ్యాయి. ఈ విషయాన్ని వెంకటేశ్వర్లు పలుమార్లు తల్లి రమణమ్మ దృష్టికి తీసుకెళ్ళాడు. అయితే ఆమె వెంకటేశ్వర్లును తిట్టి పెద్దకొడుకునే సమర్థిస్తూ వచ్చింది. ఈనెల 4 న వీరంతా మండలంలోని పొట్టెంపాడు సమీపంలోని సర్వేపల్లి రిజర్వాయర్ కు వెళ్ళారు. ఇక్కడ కూడా అన్నదమ్ములు గొడవపడ్డారు. ఈ క్రమంలో రమణమ్మ పెద్దకొడుక్కే సపోర్ట్ చేయడంతో ఆగ్రహించిన వెంకటేశ్వర్లు కత్తితో తల్లి మెడ మీద నరికాడు. దీంతో మిగిలిన వాళ్ళు వెళ్లిపోయారు. నిందితుడు తల్లి శవాన్ని అక్కడి మిట్టకాలువ తూములో పడేసి పరారయ్యాడు. ఈనెల 5న దీనిని హత్య కేసుగా నమోదు చేశామని, నిందితుడు వెంకటేశ్వర్లును అరెస్ట్ చేసిన కృష్ణపట్నం సీఐ షేక్ ఖాజావలీ, ఎస్సై అంజిరెడ్డి, హెడ్‌కానిస్టేబుల్ అశోక్‌లను అభినందిస్తున్నట్లు డీఎస్పీ తెలిపారు. వీరికి జిల్లా ఎస్పీ ద్వారా రివార్డులు అందజేస్తామన్నారు.

### జిల్లాలో 74 దుకాణాల్లో

## మద్యం అమ్మకాలు ప్రారంభం

జిల్లాలోని 74 మద్యం దుకాణాల్లో ఈనెల 15 నుంచి మద్యం విక్రయాలు ప్రారంభమయ్యాయి. లాక్‌డౌన్ నేపథ్యంలో మార్చి 22న జిల్లాలోని 280 ప్రభుత్వ మద్యం దుకాణాలు, బార్ అండ్ రెస్టారెంట్లను అధికారులు మూసివేశారు. సడలింపులు ఇచ్చిన తర్వాత గత నెలలో 151 దుకాణాలు తెరిచారు. అయితే, నెల్లూరు నగరంతో పాటు పలు మండ లాలు కంటోన్మెంట్ జోన్లలో ఉండడంతో అక్కడ షాపులను తెరిచేందుకు అనుమ తించలేదు. తాజాగా ఉన్నతాధికారుల ఆదేశాలతో ఈనెల 15 నుంచి జిల్లా కేంద్రమైన నెల్లూరు నగరంలో 28 మద్యం దుకాణాలు, నెల్లూరు రూరల్‌లోని 3, కావలి మునిసిపాలిటీ పరిధిలో 6, కోవూరు మండలంలో 8, బుచ్చిరెడ్డి పాళెంలో 4, గూడూరులో 7, వాకాడులో 1, సూళ్ళూరుపేటలో 4, నాయుడుపేటలో 11 మద్యం దుకాణాల్లో విక్రయాలు ప్రారంభమయ్యాయి. ఇంకా 55 మద్యం దుకాణాలు కంటోన్మెంట్ జోన్లలో ఉం డడంతో వాటిని మూసివేసి ఉన్నారు.

## జిల్లాకు 2 ఏకలవ్య పాఠశాలలు

జిల్లాకు రెండు ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ పాఠశాలలు మంజూరుచేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసిందని ఐటి డిఏ పి.ఓ మణికుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని ఓజిలి, కొడవలూరు లను వీటి ఏర్పాటుకు కేటాయించినట్లు పేర్కొన్నారు.

# పరిశోధనల బలం... ప్రగతికి మూలం

పెట్టుబడులు రావాలంటే పరిశోధనపై మనం దృష్టి పెట్టాలనే విషయంపై చర్చించుకుంటున్నాం. విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులు(ఎఫ్‌డిఐ) యిటీవల కాలంలో పుంజుకున్నాయని సంతోషిస్తున్నాం. కానీ పరిశోధనా రంగానికి మాత్రం వచ్చేవైతే తగ్గిపోతున్నాయి. 2015–16లో 23.50 కోట్ల డాలర్లు వస్తే, 2016–17 నాటికి అది 8.40 కోట్ల డాలర్లయింది. 2017–18 నాటికి 10.70 కోట్లకు పెరిగి, మళ్లీ 2018–19 నాటికి 8.10కోట్లకు పడిపోయింది. అంటే ఆ పెట్టుబడులన్నీ స్టాక్ మార్కెట్లకు, కన్స్యూమర్ గూడ్స్ వంటి రంగాలకి పోతున్నాయన్నమాట.

పరిశోధనల ప్రామాణితకు గీటురాయి పేటెంట్లు. మనం ఎన్ని పేటెంట్లకు అప్లయి చేశామన్నదానిపై మనం కొత్తగా ఏం కనుక్కున్నామన్నది తెలుస్తుంది. 2018లో ప్రపంచవ్యాప్తంగా 33 లక్షల పేటెంట్లు ఫైల్ అయ్యాయి. వీటిలో సగానికి పైగా చైనా చేసింది. అదీ వారు పరిశోధనకు యిచ్చే ప్రాధాన్యం! 2019లో భారతదేశం నుంచి ఫైల్ అయినవి 25,715 మాత్రమే. కానీ శాంక్షన్ అయినవి 15వేల దరిదాపుల్లోనే ఉన్నాయి. వీటిలో కళలకు సంబంధించిన వాటితో సహా అన్ని రకాలూ వుంటాయి. ఎక్కువ మంది ప్రయివేటు వ్యక్తులు, సంస్థలు ఫైల్ చేసినవే. ప్రభుత్వ సంస్థలైన సిఎస్ఐఆర్ (కౌన్సిల్ ఆఫ్ సైన్స్ అండ్ ఇండస్ట్రియల్ రిసెర్చ్), ఐఐఎస్‌సి(ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్స్), ఐఐటి వంటివన్నీ కలిసి ఫైల్ చేసినవి 128 మాత్రమే. ఇక యూనివర్శిటీల నుంచి ఫైల్ అయినవి 1227.

సంఖ్యరీత్యా రిసెర్చి సంస్థల నిర్వహణ చూడబోతే 2018లో కేంద్రప్రభుత్వ ఆధ్వర్యంలో 9% ఉంటే, స్టేట్ సెక్టార్‌లో 15%, యూనివర్శిటీలలో 10%, పబ్లిక్ సెక్టార్‌లో 3%, ప్రయివేటు సెక్టార్‌లో 63% ఉన్నాయి. పరిశోధనల సందర్భంగా యూనివర్శిటీల గురించి మాట్లాడుకోవలసినది ఎంతో వుంది. ఇతర దేశాలలో ప్రయోగాలన్నీ యూనివర్శిటీ లాబ్స్‌లో జరిగి ఆ పరిశోధనా ఫలితాలను పరిశ్రమలకు అందిస్తాయి. పరిశ్రమలు వాటిని భారీ స్థాయిలో ఉత్పత్తి చేసి, వాటిని వాణిజ్యపరంగా సామాన్యుడికి అందించగలమో లేదో పరీక్షిస్తాయి.

అందుకే యుకె, ఇటలీలలో 24% పరిశోధనలు యూనివర్శిటీలలోనే జరుగుతాయి. ఫ్రాన్స్‌లో యిది 21%, జర్మనీలో 17% కాగా యుఎస్ఏలో 13%. మన దేశానికి వస్తే అది కేవలం 7శాతం. ఒఇసిడి (ఆర్గనైజేషన్ ఫర్ ఎకనమిక్ కోఆపరేషన్ అండ్ డెవలప్‌మెంట్)లో 35 దేశాలున్నాయి. వాటిలో దేశంలో జరిగే పరిశోధనల్లో 15–35% యూనివర్శిటీల నుంచే వస్తోంది. బేసిక్ రిసెర్చి విషయంలో యిది 60 శాతం దాకా వుంటోంది.

ఈ పరిస్థితి మారాలంటే ప్రభుత్వం యూనివర్శిటీలపై శీతకన్ను వేయడం మానాలి. 1950, 60లలో పరిశోధనల విషయంలో భారతదేశంలో యూనివర్శిటీలకు చాలా ప్రాముఖ్యత వుండేది. కానీ పోనుపోను తగ్గుతూ వచ్చింది. అసలు యూనివర్శిటీల నిర్వహణే సరిగ్గా వుండటం లేదు. చాలా యూనివర్శిటీలకు వైస్ ఛాన్సలర్‌లే లేరు, నిధులు లేవు, వసతులు లేవు, బోధనాసిబ్బంది లేరు, మౌలిక వసతులూ లేవు. కానీ విదేశాల పరిస్థితి వేరు.

మన దేశానికి వస్తే యూనివర్శిటీ గ్రాంట్స్ కమిషన్ 2005 నాటి నివేదిక ప్రకారం 120 యూనివర్శిటీల్లో కేవలం 20 మాత్రమే జాతీయ స్థాయిలో మూడు ప్రతిష్ఠాత్మక సైన్స్ ఎకాడమీలకు (ఇండియన్ సైన్స్ ఎకాడమీ, ఇండియన్ ఎకాడమీ ఆఫ్ సైన్సెస్, నేషనల్ ఎకాడమీ ఆఫ్ సైన్సెస్) తమ 'ఫెలో'లను పంపగలిగాయి. తమ యూనివర్శిటీలలో పరిశోధనలు పూర్తి చేశాక, మరింత ఉన్నత స్థాయి పరిశోధనకై ఎకాడమీలకు వెళ్లేవారిని 'ఫెలో' అంటారు. ఒక అంచనా ప్రకారం భారతదేశంలో 10 లక్షల జనాభాకు 150 మంది పరిశోధకులు ఉన్నారు. అంతర్జాతీయ ప్రమాణాలతో పోలిస్తే యిది చాలా తక్కువ.

ఈ పరిస్థితుల్లో ఆర్ అండ్ డిపై ప్రభుత్వం ప్రత్యేకదృష్టి పెట్టి ఎంతో చేయాలి. గతంలో దానిపై పెట్టిన ఖర్చుకి ఇన్‌కమ్‌టాక్స్ రాయితీలు భారీగా యిచ్చేవారు. వాటిని క్రమేపీ తగ్గిస్తూ వచ్చి, యిప్పుడు సాంతం తీసేశారు. అవి మళ్లీ పునరుద్ధరించాలి. బయోటెక్నాలజీ ఇండస్ట్రీ రిసెర్చ్ అసిస్టెన్స్ కౌన్సిల్ (బిరాక్) వంటి సంస్థల ద్వారా పరిశ్రమలకు గ్రాంట్లు యిప్పించాలి.

ఇక్కడొక మాట చెప్పాలి.. ఇలాంటి కౌన్సిళ్లకు ఐఎంఎఫ్ కూడా నిధులిస్తుంది. కానీ వాటిలో చాలా భాగం ప్రభుత్వ రిసెర్చి సంస్థలకు మళ్లించడం జరుగుతోంది. అవి ఆ నిధులను తమ సిబ్బంది జీతభత్యాలకు వెచ్చిస్తున్నాయి. పరిశ్రమ పెట్టినప్పుడు బ్యాంకులు రెండు, మూడేళ్లు మాత్రమే మారటోరియం యిస్తాయి. ఆ లోపున అవి తమ కాళ్ల మీద తాము నిలబడి అప్పు తీర్చే సామర్థ్యం సంతరించుకుంటాయని బ్యాంకుల అంచనా. ఈ పరిశోధనా సంస్థలు కూడా ఏర్పరచిన ఐదేళ్లలోగా పరిశోధనలు పూర్తి చేసి, పేటెంట్లు అమ్మి, స్వయంపోషక స్థితికి రావాలి. స్థాపించి 30 ఏళ్లయినా ప్రభుత్వం నిధుల కోసం ఎదురు చూడడం సమర్థనీయం కాదు.

కొత్తగా పరిశోధనలు మొదలుపెట్టిన ప్రభుత్వ రిసెర్చి సంస్థలకు, యూనివర్శిటీలకు ప్రభుత్వం ప్రత్యేకనిధులు సమకూర్చి అనేక నూతన రంగాల్లో పరిశోధనలు చేయించాలి. వాటికి, పరిశ్రమలకు అనుసంధానం కుదిర్చే వ్యవస్థ ఏర్పరచాలి. లేకపోతే ఆ శ్రమంతా వ్యర్థమౌతుంది.

ఈ విధంగా పరిశోధనల బలంతో మన పరిశ్రమలు పుంజుకుంటే మనం ఎగుమతి చేసే స్థాయికి వస్తాం. అప్పుడే మన దేశపు బాలన్స్ ఆఫ్ ట్రేడ్ (ఎగుమతులు–దిగుమతుల మధ్య తూకం) సరిగా వుంటుంది. ఎగుమతులు వుంటేనే మన పరిశ్రమలు నిలదొక్కుకుంటాయి. ఉత్పాదనలను అందుబాటు ధరల్లో సామాన్యులకు అందించాలంటే దేశీయ మార్కెట్ చాలదు. చౌకగా లభించే దిగుమతి సరుకులతో పోటీ పడలేవు. ఇవన్నీ జరగనిదే విదేశీ పెట్టుబడులను ఆకర్షించడంలో మనం చైనాతో పోటీ పడతామని ఆశించడం పగటికలలతో సమానం. ఉదాహరణకి ఫార్మా రంగమే తీసుకుందాం.

దేశంలో 4 కోట్లమంది ఫార్మా రంగంలో పనిచేస్తున్నారు. పరిమాణ (వాల్యూమ్) పరంగా ఔషధాల ఉత్పత్తిలో మనం ప్రపంచంలో మూడవ స్థానంలో ఉన్నాం. 200 దేశాలకు ఎగుమతి చేస్తున్నాం. ప్రపంచానికి కావలసిన వాక్సిన్లలో 50% మనమే సరఫరా చేస్తున్నాం. అమెరికాలో లభ్యమయ్యే జనరిక్ డ్రగ్స్‌లో 40%, యుకెలో లభ్యమయ్యే జనరిక్ డ్రగ్స్‌లో 25% మన దేశమే అందిస్తోంది. 2019లో 1914 కోట్ల డాలర్ల విలువైన ఆరోగ్య సంబంధిత (బల్క్ డ్రగ్స్, ఇంటర్మీడియేట్స్, డ్రగ్ ఫార్ములేషన్స్, బయోలాజికల్స్, మూలికా ఔషధాలు, సర్జికల్స్) ఎగుమతులు చేశాం. తెలంగాణలో 800 ఫార్మా, బయోటెక్, ఆరోగ్య సంబంధిత పరిశ్రమలున్నాయి. అంటే మన దేశానికి, రాష్ట్రానికి ఫార్మా రంగం ఎంత ముఖ్యమైనదో అర్థమౌతోందిగా.

మరి అలాటి రంగం ఫార్ములేషన్స్‌కై ఎపిఐ (యాక్టివ్ ఫార్మాస్యూటికల్ ఇన్‌గ్రెడియంట్) దిగుమతులపై విపరీతంగా ఆధారపడుతోంది. వాటి విలువ 350 కోట్ల డాలర్లు. దీనిలో 70% దిగుమతులు చైనా నుంచే వస్తున్నాయి. మనం పోటీదారుగా ఎదుగుతామంటే చైనా ఏం చేస్తుందో చూడాలి. హైదరాబాదులోని ఒక సంస్థ సల్ఫా మైథాక్సోజాల్ ఉత్పత్తిలో ప్రపంచంలోనే ప్రథమస్థానం పొందింది. కానీ దాని ముడిసరుకంతా చైనా నుంచే వస్తుంది. ఒక నెల పాటు సరఫరా ఆగిపోయేసరికి కంపెనీ విలవిల లాడిపోయింది.

దీపావళి బాణసంచాయే కాదు, మనం హెవీ మిషనరీ కూడా చైనా నుంచి దిగుమతి చేసుకుంటున్నాం. మన దిగుమతుల్లో 18% చైనా నుంచే. వాటికి విఘాతం కలిగితే మనం చాలా యిబ్బంది పడతాం. అందువలన మనం దిగుమతులపై ఆధారపడనక్కరలేని స్వయంసమృద్ధి సమకూర్చుకోవాలి. దాని విషయంలో నినాదాల కంటే స్పష్టత ముఖ్యం.

బిజెపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన కొద్దినెలలకే 2014 సెప్టెంబరులోనే 'మేకిన్ ఇండియా' కార్యక్రమాన్ని ప్రారంభించింది. 'మేడ్ ఇన్ ఇండియా' కార్యక్రమమైతే టెక్నాలజీ ట్రాన్స్‌ఫర్ జరిగి వుండేది. మన సంస్థలకు పెట్టుబడిలో, లాభాల్లో, పేటెంటులో వాటా వుండి వుండేది. మనవాళ్లకు అన్ని రకాల అనుభవమూ వచ్చి వుండేది. చైనా అలాటి షరతులపైనే విదేశీ పెట్టుబడులు స్వీకరించింది.

అయితే మేకిన్..లో యిబ్బంది ఏమిటంటే అంతా విదేశీయే. పనివాళ్లు, స్థానిక వసతులు మాత్రం మనవి. భూమి, నీరు, విద్యుత్ సౌకర్యాలు కల్పించడం వలన మనకు వచ్చే లాభం ఏమిటిరా అంటే కొన్ని ఉద్యోగాలు. ఆటోమేషన్ టెక్నాలజీ విపరీతంగా పెరిగిపోయిన యీ రోజుల్లో ఉద్యోగుల సంఖ్య బహుతక్కువగా వుంటోంది. వాళ్లకు కూడా స్క్రూ డ్రైవర్ ఉపయోగించి అసెంబుల్ చేయడం తప్ప మరేమీ రావటం లేదు. కొన్ని సందర్భాల్లో స్క్రూ డ్రైవర్ అవసరం కూడా లేకుండా రెండు డిప్పలు గట్టిగా ఒత్తితే సరిపోతోంది. ఆ విధంగా ఆ పథకం విఫలమైందనే చెప్పాలి.

ఇప్పుడు కరోనానంతర పరిస్థితిలో వెయ్యి విదేశీ కంపెనీల దాకా భారత్ వైపు




**కె.ఐ. వరప్రసాద్‌రెడ్డి**

వ్యవస్థాపక చైర్మన్, శాంతా బయోటెక్


చూస్తున్నాయన్న వార్తలు వస్తున్నాయి. వీటిలో నిజమెంతో, అతిశయోక్తి ఎంతో తెలియదు. ఎన్ని వచ్చినా మనం గుర్తుపెట్టుకోవలసినది.. వాటిల్లో 100% ఎఫ్‌డిఐలు అనుమతించకూడదు. 50%కి లోపే అనుమతించి, యాజమాన్యం భారతీయుల చేతుల్లోనే వుండేట్లు చూడాలి. టెక్నాలజీని మనకు అప్పగించాలని, శాస్త్ర, సాంకేతిక విభాగాల్లో కీలకమైన పదవులలో మనవారిని నియమించాలని, ఆర్ అండ్ డి చేసి తీరాలని, దానిపై మనకు పేటెంటులో భాగం యిచ్చి తీరాలని, ఉత్పాదనలో సగాన్ని పెట్టుబడి పెట్టిన కంపెనీ స్వదేశానికి ఎగుమతి చేసి విదేశీ మారక ద్రవ్యాన్ని ఆర్జించాలని.. ఇలాంటి షరతులు విధించాలి.

ఇవేమీ అన్యాయమైన షరతులు కావు. అమెరికా, యూరోప్ యిప్పుడు స్వీయ రక్షణకై తమ చట్టాలు మార్చేసి, చైనా పెట్టుబడులకు అడ్డంకులు కల్పిస్తున్నాయి. పైన వివరించినట్లు మన దేశం పరిశోధనా విభాగంలో చాలా వెనకబడి వుంది. ఇప్పటికిప్పుడు మనం భారీ పెట్టుబడులు పెట్టలేము, నిపుణులను తయారు చేసుకోలేము. అందువలన విదేశీ పెట్టుబడిదారులకు మన అవసరం వున్నప్పుడే యిక్కడా ఆర్ అండ్ డి చేసి తీరాలని, మేధోహక్కులు (ఐపిఆర్– ఇంటలెక్చువల్ ప్రాపర్టీ రైట్స్)లో వాటా యివ్వాలని, మనం పట్టుబట్టి సాధించగలం. అవేమీ లేకుండా తలుపులు బార్లా తెరిచి, చీప్ లేబరు యిస్తాం, గుప్పెడు ఉద్యోగాలు మా మొహాన పడేసి మీ యిష్టమొచ్చినట్లు చేసుకోండి అంటే మాత్రం మన దేశ వనరులను దోపిడీ చేసే దొంగలను పిలిచి నెత్తి కెక్కించుకున్నట్లే.

ఇంకొక్క మాట.. కేంద్రం ఎన్ని పథకాలు రూపొందించినా అమలు చేయవలసినది రాష్ట్రాలు మాత్రమే. పరిశ్రమలు నెలకొల్పితే తమ రాష్ట్రప్రజలకు ఉద్యోగాలు వచ్చేస్తాయన్న ఆశ వారికి పెద్దగా వుండటం లేదు. ఎందుకంటే నైపుణ్యతతో కూడిన ఉద్యోగాలలో ఇలాంటి నిబంధనలు పెడితే ఎవరూ ముందుకు రారు. రాష్ట్రాలకు కావలసినది ఆదాయం కూడా. గతంలో ఉత్పత్తి జరిగిన రాష్ట్రాలకు పన్ను వచ్చేది. జిఎస్‌టి వచ్చాక వస్తు వినియోగం అయిన రాష్ట్రాలకు పన్ను ఆదాయం వస్తోంది. పారిశ్రామిక ఉత్పాదనను ప్రోత్సహించిన రాష్ట్రాలకు ప్రత్యేక లాభమేమీ వుండటం లేదు. అదీ మారాలి.

(సమాప్తం)



ఈ నెల 15వ తేదీ మాజీమంత్రి పొంగూరు నారాయణ జన్మదినోత్సవాన్ని పురస్కరించుకుని ఆయనను కలిసి శుభాకాంక్షలు తెలియజేస్తున్న ఎమ్మెల్సీ, తెదేపా జిల్లా అధ్యక్షుడు బీద రవిచంద్ర

# కిసాన్ క్రెడిట్ కార్డులకు.. రుణాలు ఇవ్వండి

**— జిల్లా కలెక్టర్ ఎంవి శేషగిరిబాబు**





కిసాన్ క్రెడిట్‌కార్డులకు పంటరుణాలతో పాటు ఇతర రుణాలు కూడా మంజూరు చేయాలని జిల్లా కలెక్టర్ ఎంవి శేషగిరిబాబు అధికారులను ఆదేశించారు. నెల్లూరులోని డిఆర్‌డిఏ కార్యాలయంలో ఈనెల 17న జరిగిన బ్యాంకర్ల జిల్లా స్థాయి సమితి సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ అర్హత కలిగిన రైతులకు కిసాన్ క్రెడిట్‌కార్డులతో పశువులు, కోళ్ళు, చేపల పెంపకానికి రుణాలు అందించాలని సూచించారు. 2020–21 సంవత్సరానికి మెప్మా కింద 2325 మంది స్వయం సహాయక సంఘాలకు 130 కోట్లు, డిఆర్‌డిఏ–వైయస్సార్ క్రాంతి పథకంలో గ్రామీణ ప్రాంతాల్లోని 24121 స్వయం సహాయక సంఘాలకు 778.25 కోట్లు మంజూరు చేయాలని లక్ష్యాలను నిర్ధేశించారు. చేనేత,వ్యవసాయం, పరిశ్రమలు, మత్స్యశాఖ, పాలకేంద్రాలకు రుణాలు మంజూరుచేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో డిఆర్‌డిఏ పి.డి శీనానాయక్; నాబార్డ్ జేడిఎం రవిసింగ్, ఎల్‌డిఎం వైవి రాంప్రసాద్‌రెడ్డి, పరిశ్రమలశాఖ జనరల్‌మేనేజర్ ప్రసాదరావు, వ్యవసాయశాఖ జేఈ ఆనందకుమారి, మెప్మా పీడీ రవీంద్ర, బ్యాంకర్లు పాల్గొన్నారు.

## 'ప్రభా'తం

# కూటమిలో చేరాల్సిందే!

అంతర్జాతీయంగా గత ఆరేళ్లుగా భారతదేశ ప్రాబల్యం పెరుగుతూ వస్తోంది. ఐక్యరాజ్య సమితి సమావేశాలలో సైతం భారతదేశం మాటకు అన్ని దేశాలు విలువనిస్తున్నాయి. అంతర్జాతీయ ఉగ్రవాదంపై భారత్ తలపెట్టిన పోరుకు పాకిస్థాన్, చైనా వంటి దేశాలు తప్పితే అన్ని దేశాలు మద్దతు పలికాయి. భారత్ మాటకు విలువనిచ్చి అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని ప్రవేశపెట్టడం కూడా జరిగింది. పాకిస్థాన్‌ను అంతర్జాతీయ సమాజానికి దూరంగా వుంచడంలో భారత్ విజయం సాధించింది. ఎన్నో అంతర్జాతీయ సదస్సులకు భారత్ నేతృత్వం వహించడం జరిగింది. భారత ప్రధాని నరేంద్ర మోడీ చిన్న, పెద్ద అని తేడా లేకుండా అన్ని దేశాలతో సత్సంబంధాలు నెలకొల్పాడు.

భారత్‌కు అంతర్జాతీయంగా ప్రాధాన్యత పెరుగుతున్న క్రమంలో... త్వరలో జరగబోయే జి-7 దేశాల సదస్సుకు అధ్యక్షత వహించాలని భారత్‌కు ఆహ్వానం అందింది. ఇప్పటి వరకు జి-7లో ఏడు అగ్రదేశాలు వుంటున్నాయి. ఐక్యరాజ్య సమితి సమావేశాల తర్వాత జి-7 దేశాల సదస్సుకు అత్యంత ప్రాధాన్యత వుంటుంది. ఇప్పుడు జి-7 పరిధిని భారత్, రష్యా, ఆస్ట్రేలియా, దక్షిణ కొరియాలను కలుపుకుని జి-11కు విస్తరించాలన్నది అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ అభిప్రాయం. ఈమేరకు ప్రయత్నాలు జరుగుతున్నాయి కూడా! ఒకరకంగా జి-7 కూటమి, జి-11 కూటమిగా మారడ మంటే అది చైనాకు వ్యతిరేకంగా కూటమి కట్టడమే! ప్రస్తుతం జి-7లో వున్న దేశాలన్నీ కూడా చైనాను వ్యతిరేకించేవే! కరోనా వైరస్ వ్యాప్తి తర్వాత చైనాతో ఈ కూటమి లోని దేశాలు తెగదెంపులకు సిద్ధమయ్యాయి. ఈ పరంపరలో ఆస్ట్రేలియా, భారత్ వంటి దేశాలకు చైనాతో పడకుండా వచ్చింది. దక్షిణ కొరియా సైతం చైనాకు వ్యతిరేకమవుతోంది. రష్యా వైఖరి మాత్రం ఇంకా తేటతెల్లం కాలేదు. కాని అమెరికా అధ్యక్షుడు ట్రంప్ మాత్రం తన పాలనాకాలంలో రష్యాకు ఎనలేని ప్రాధాన్యతనిస్తున్నాడు. జి-11 కూటమితో రష్యాను కూడా చేర్చాలని విశ్వప్రయత్నం చేస్తున్నాడు. ఈ పదకొండు దేశాలను కలిపితే ప్రపంచంలోనే అజేయ కూటమి అవుతుందని, చైనాను అన్ని విధాలా ధీటుగా కట్టడి చేయొచ్చన్నది అమెరికా అధ్యక్షుడి వ్యూహం.



> భారత్‌కు అంతర్జాతీయంగా ప్రాధాన్యత పెరుగుతున్న క్రమంలో... త్వరలో జరగబోయే జి-7 దేశాల సదస్సుకు అధ్యక్షత వహించాలని భారత్‌కు ఆహ్వానం అందింది. ఇప్పటి వరకు జి-7లో ఏడు అగ్రదేశాలు వుంటున్నాయి. ఐక్యరాజ్య సమితి సమావేశాల తర్వాత జి-7 దేశాల సదస్సుకు అత్యంత ప్రాధాన్యత వుంటుంది. ఇప్పుడు జి-7 పరిధిని భారత్, రష్యా, ఆస్ట్రేలియా, దక్షిణ కొరియాలను కలుపుకుని జి-11కు విస్తరించాలన్నది అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ అభిప్రాయం. ఈమేరకు ప్రయత్నాలు జరుగుతున్నాయి కూడా!

మరి జి-11 కూటమిలో భారత్ చేరాల్సిన అవసరముందా? అమెరికా, యూరప్ దేశాలు భారత్‌ను తెలివిగా తమ కూటమిలోకి లాక్కుంటున్నాయా? ఆసియా ఖండంలో చైనాకు వ్యతిరేకంగా జరిగే కార్యకలాపాలకు భారత్‌ను వేదికగా వాడుకోవాలని చూస్తున్నాయా? ఈమధ్య కాలంలో ఈ తరహా ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి. అమెరికా, ఇతర యూరప్ దేశాలు భారత్‌కు ప్రాధాన్యతనివ్వడంలోనూ, భారత్‌తో స్నేహం చేయడంలోనూ వారికి స్వార్ధం, సొంత ప్రయోజనాలు వుండొచ్చు. అదే సమయంలో ఆ దేశాలతో సత్సంబంధాల వల్ల భారత్‌కు నెరవేరే ప్రయోజనాలూ లేకపోలేదు. గత కొన్నేళ్లుగా పాకిస్థాన్‌కు వ్యతిరేకంగా అంతర్జాతీయ సదస్సులలో భారత్ చేసే ప్రతిపాదనలన్నింటికీ ఈ దేశాలు మద్దతు నిస్తున్నాయి. కాని, చైనా ఒక్కటే భారత్‌కు వ్యతిరేకంగా పాకిస్థాన్‌కు అండగా నిలుస్తోంది. మసూద్ అజాద్‌ను అంతర్జాతీయ ఉగ్రవాది అని అన్ని దేశాలు ముద్రవేస్తే, చైనా ఒక్కటే అడ్డుకుంది. భద్రతా మండలిలో భారత్‌కు శాశ్వత సభ్యత్వం కల్పించే ప్రతిపాదనపై అన్ని సభ్య దేశాలు మద్దతునిస్తే చైనా ఒక్కటే వ్యతిరేకించింది.

మాజీ రక్షణ మంత్రి స్వర్గీయ జార్జ్ ఫెర్నాండేజ్ చెప్పినట్లు మనకు అసలైన ముప్పు పాకిస్థాన్‌తో కాదు, చైనాతోనే! మన సరిహద్దులను కబళించాలని చైనా గుంటనక్కలా కాచుకుని కూర్చుంది. 1962లోనే నెహ్రూ అసమర్ధతను అలుసుగా తీసుకుని మన దేశంలో కొంత భూభాగాన్ని ఆక్రమించింది. ఇప్పుడు కూడా కొన్ని సరిహద్దు ప్రాంతాలపై పేచీలు పెడుతూ వివాదాలు సృష్టిస్తూనే వుంది. ఈక్రమంలోనే పాకిస్థాన్, కొత్తగా నేపాల్ వంటి దేశాలను భారత్‌పైకి ఉసి గొల్పుతోంది. భారత్‌లో అంతర్భాగం కావాల్సిన నేపాల్, నెహ్రూ నిర్వాకం మూలంగా స్వతంత్ర దేశంగా వుండిపోయింది. ఇప్పుడు ఆ దేశం కూడా భారత్‌కు కంట్లో నలుసులా తయారైంది. దీని వెనుక కూడా చైనానే వుందన్నది నగ్నసత్యం. భారత్‌తో చైనా ఎప్పుడూ సఖ్యత కోరుకోదు. భారత్‌ను ఆర్థికంగా ఎదగకుండా, తనకు పోటీదారుగా కాకుండా చేసుకోవడమే చైనా లక్ష్యం. అలాంటప్పుడు చైనా ఏదో అనుకుంటుందని, ఆ దేశం మనకు శత్రువవుతుందేమోనని చెప్పి ఇతర దేశాలతో ఐక్యతను, సంబంధాలను వదులుకోవాల్సిన పనిలేదు.

చైనా తన కుయుక్తులను అప్పుడే మొదలు పెట్టింది. ఓ పక్క చర్చల ద్వారా సరిహద్దుల్లో సైన్యాలను ఉపసంహరించుకుంటున్నామని మాయమాటలు చెప్పి, రెండు నాల్కల ధోరణితో ఊహించని విధంగా భారత్‌పై దొంగదెబ్బకు పాల్పడడం దారుణం. ఈ నెల 16వ తేదీన గాల్వాన్‌లో చైనా ఆర్మీ జరిపిన దాడిలో 20 మంది భారతీయ సైనికులు మరణించడం ఇరు దేశాల మధ్య యుద్ధమేఘాలను కమ్ముకునేలా చేసింది. డ్రాగన్ కుట్రపూరితమైన ఇలాంటి దుందుడుకు చర్యలు ప్రపంచ వ్యాప్తంగా చర్చనీయాంశంగా మారాయి. భారత్ పట్ల ప్రపంచమంతా సానుకూల ధోరణితో ఉంది. దాదాపు 40 ఏళ్ళ తర్వాత చైనా మనపైకి దాడికి పాల్పడడం ఇదే తొలిసారి. మొత్తంమీద ఈ పరిణామాలు ఎక్కడికి దారి తీస్తాయో అర్ధంకాని పరిస్థితి ఏర్పడింది.

# 130 కోట్ల స్త్రీనిధి రుణాలు

**డిఆర్‌డిఏ పి.డి శీనానాయక్**

జిల్లాలోని స్వయం సహాయక గ్రూపు మహిళల ఆర్థిక ప్రగతికి 2020-21 ఆర్థిక సంవత్సరంలో 130 కోట్ల రూపాయల స్త్రీనిధి రుణాలను మంజూరుచేయాలని లక్ష్యంగా నిర్దేశించినట్లు డిఆర్‌డిఏ పి.డి శీనానాయక్ పేర్కొన్నారు. ఈనెల 15న నెల్లూరులోని డిఆర్‌డిఏ కార్యాలయంలో ఏర్పాటుచేసిన సంబంధిత అధికారుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ డిపిఎంలు, ఏ.సిలు ప్రతి నెలా లక్ష్యలను నిర్ధేశించుకుని పూర్తిచేయాలన్నారు. బ్యాంకు లింకేజీ, స్త్రీనిధి రుణాల రికవరీలపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. అర్హత కలిగిన ఎస్‌హెచ్‌జిలకు బ్యాంకు లింకేజీ రుణాలు మంజూరుచేయాలని, లబ్దిదారులు ఆ రుణాలను తమ ఆర్థికాభివృద్ధికి ఉపయోగపడేలా సద్వినియోగం చేసుకుని ప్రగతిని సాధించేలా చర్యలు చేపట్టాలని ఆయన తెలియజేశారు. గ్రామీణప్రాంతాల్లోని మహిళల ఆర్థికాభ్యున్నతిని మెరుగు పరచేందుకు తగు శ్రద్ధ చూపాలని ఆయన తన సిబ్బందిని ఆదేశించారు. ప్రభుత్వ పథకాలు సక్రమంగా అమలు చేయాలన్నారు. విధుల నిర్వహణలో ఉద్యోగులు, సిబ్బంది ఎలాంటి నిర్లక్ష్యం వహించకుండా అందరూ క్రమశిక్షణతో, శ్రద్ధతో పనిచేయాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో డిపిఎంలు, ఏ.సిలు తదితర సిబ్బంది పాల్గొన్నారు.

# జొన్నవాడలో శాస్త్రోక్తంగా ప్రాకార దేవతల ప్రతిష్ట



జిల్లాలోని పవిత్రపుణ్యక్షేత్రమైన జొన్నవాడ కామాక్షమ్మ అమ్మవారి దేవాలయంలో ఈనెల 12న ప్రాకారదేవతల ప్రతిష్ట కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఆలయంలో హోమాలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం దేవతా విగ్రహాల ప్రతిష్ట, తారకేశ్వరస్వామి ధ్వజస్తంభ ప్రతిష్ట, నాగప్రతిష్ట, నవగ్రహాల ప్రతిష్ట కార్యక్రమాలను అర్చకులు శాస్త్రోక్తంగా నిర్వహించారు. దేవాదాయశాఖ సహాయ కమిషనర్ వి.రవీంద్రరెడ్డి, ఆలయ ఛైర్మెన్ చీమల రమేష్‌బాబు, ఇ.ఓ ఏ.శ్రీనివాసులురెడ్డి, ధర్మకర్తల మండలి సభ్యులు మధుసూదన్‌రెడ్డి, ప్రమీలమ్మ, సుమిత్రమ్మ, విమలమ్మ, సంగీతమ్మ, ఇన్నమూరి నరసింహారావు, వెంకటరమణయ్య, ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

# భక్తిశ్రద్ధలతో శ్రీ మహావిష్ణు బ్రహ్మోత్సవాలు

నెల్లూరు, వేదాయపాళెంలో ఉన్న అయ్యప్పస్వామి దేవస్థానం ప్రాంగణంలో కొలువైవున్న శ్రీ మహావిష్ణు ఆలయ దశమ వార్షిక బ్రహ్మోత్సవాలు ఈనెల12న భక్తిశ్రద్ధలతో ప్రారంభమయ్యాయి. లాక్‌డౌన్ నిబంధనలు పాటిస్తూ ఆలయ అర్చకులు స్వామివారికి శాస్త్రోక్తంగా బ్రహ్మోత్సవాలను ప్రారంభించారు. ఉదయం పుణ్యాహవచనం, మహాభిషేకం, స్వామివారి అష్టోత్తర శతకలశాభి షేక పూజ, రాత్రి అంకురార్పణ, విష్వక్సేనారాధన, మృత్సంగ్రహణం పూజలు, 13వతేది ఉదయం ధ్వజారోహణం, రాత్రి మహాకుంభా రాధన నిర్వహించారు. అయ్యప్ప సేవాసమాజం అధ్యక్ష కార్య దర్శులు పి.టి.రంగరాజన్, జి.శేషగిరిరావులు పర్యవేక్షించారు.

## తిరుమలలో ఒకే తరహా దర్శనం ఉండాలి

దేవుడి ముందు అందరూ సమానమని అంటారు గాని, ఆచరణలో మాత్రం అలా వుండడం లేదు. దైవదర్శనాలలోనూ అధికారం, ధనం ప్రభావాలు కనిపిస్తుంటాయి. ముఖ్యంగా హిందూ ఆధ్యాత్మిక కేంద్రాల లోనే రాజకీయ సిఫారసులు, డబ్బులు పనిచేస్తుంటాయి. అధికార, ధనబలం వున్నోళ్లకు దైవదర్శనం ఒకరకంగానూ, పేదోళ్లకు ఇంకో రకంగానూ వుంటుంది. తిరుమలలోనే చూడండి... సిఫార్సు లేఖలు ఉన్నోళ్లకి లేదా 10వేల రూపాయలు కట్టినవాళ్ళకు దర్శనం మొదటి వాకిలి నుండి లభిస్తుంది. పేదోళ్లకు ఏడు తలుపుల ఇవతల లభిస్తుంది. దేవుడి దగ్గర ఈ తేడా ఏంటి? కలియుగ ప్రత్యక్ష దైవం ధనికులకే ప్రత్యేకంగా దర్శన భాగ్యం కల్పించేలా చేయడం విచారకరం. అయితే, ఈ కోవిడ్ మూలంగా తిరుమలలో అందరికి జయ విజయుల విగ్రహాల వద్ద నుండే శ్రీవారి దర్శనం లభిస్తోంది. దీనిని ఇకముందు కూడా కొనసాగిస్తే తారతమ్యాలు తగ్గుతాయి.

**సి.రాజీవి, నెల్లూరు.**

## కమ్యూనిస్టులు మారరా?

భారతదేశంలోని కమ్యూనిష్టులకు ప్రతి ఎన్నికలలోనూ పరాభవాలే ఎదురవుతున్నా మారడం లేదు. జాతీయవాదం కంటే విదేశీ భక్తితోనే వుంటున్నారు. చైనాతో ఇటీవల భారత్‌కు సరిహద్దు ఉద్రిక్తతలు వచ్చిన తరుణంలో కూడా ఇక్కడి కమ్యూనిస్టు నాయకులు చైనాను కీర్తించేలా ప్రకటనలు చేయడం దుర్మార్గం. ఒకవేళ చైనాతో భారత్‌కు యుద్ధం వచ్చినా కూడా వీళ్ళంతా చైనాకు మద్దతుగా నిలిచేటట్లున్నారు. భారత్‌లో వుంటూ ఇక్కడ తిండి తింటూ చైనాకు వంతపాడే వీళ్లను ఏం చేసినా పాపం లేదు.

**రాయవరపు మల్లిఖార్జున, నెల్లూరు.**

## అవినీతికి కులం కార్దా?




అవినీతి, అక్రమాలకు కూడా కులం, మతం రంగు పులమడం అన్యాయం. ఏ కులం వాళ్ళు నేరం చేసినా ఆ నేరతీవ్రత, చట్టపరిధిలో శిక్ష ఒకటిగానే వుంటాయి. కులాలనేవి కేవలం రిజర్వేషన్లకే పరిమితం. అంతే గాని, ఒసి మంత్రులు అవినీతి చేస్తేనే శిక్షించాలి, బి.సి మంత్రులు అవినీతికి పాల్పడితే అరెస్ట్ చేయకూడదనే చట్టాలేమీ లేవు. ఈఎస్ఐ కుంభకోణంలో మాజీమంత్రి అచ్చెన్నాయుడును ఏసిబి అరెస్ట్ చేస్తే 40ఏళ్ల ఇండస్ట్రీగా చెప్పుకునే చంద్రబాబు నాయుడు దానికి కులం రంగు పులమడం దారుణం. అవినీతి, అక్రమాలకు పాల్పడితే ఎవరైనా శిక్షార్హులే!

**వెందోటి సతీష్‌రెడ్డి, కొండూరు.**




# తీరం రూపు మారనుందా?

- రామాయపట్నంకు రైట్... రైట్...

నెల్లూరు, ప్రకాశం జిల్లాల తీరప్రాంతం అభివృద్ధికి బీజం పడబోతుంది. రెండు జిల్లాల తీరప్రాంత ప్రజలు ఎంతో కాలంగా ఎదురుచూస్తున్న రామాయపట్నం పోర్టు కల సాకారం కాబోతోంది. 3,736 కోట్ల వ్యయంతో రామాయపట్నం పోర్టు నిర్మాణానికి రాష్ట్ర ప్రభుత్వం శ్రీకారం చుట్టబోతోంది. ఇప్పటికే దీనికి సంబంధించిన డిపిఆర్ కూడా వచ్చేసింది.

గత తెలుగుదేశం ప్రభుత్వంలోనూ రామాయపట్నం పోర్టుపై ప్రయత్నాలు జరిగాయి. వై.వి.సుబ్బారెడ్డి, రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి, బీద సోదరులు గట్టిగానే పోరాడారు. అయితే, ఇక ఎన్నికలు వస్తున్నాయనగా కంటి తుడుపు చర్యగా అప్పటి చంద్రబాబు ప్రభుత్వం పోర్టు నిర్మాణానికి హడావిడి శంకుస్థాపన చేసింది. ఆచరణలో మాత్రం చిత్తశుద్ధి కనిపించలేదు.

వైసిపి అధికారంలోకి వచ్చాక ప్రకాశం జిల్లా వాసిగా టిటిడి ఛైర్మెన్ వై.వి. సుబ్బారెడ్డి, నెల్లూరు ఎంపీ ఆదాల ప్రభాకర్‌రెడ్డి, కావలి ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి ఈ పోర్టు కోసం ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్‌రెడ్డి వద్ద గట్టి ప్రయత్నాలే చేశారు. ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్‌రెడ్డి కూడా ప్రధాని నరేంద్ర మోడీ దృష్టికి ఈ పోర్టు ప్రాధాన్యత తీసుకెళ్లి సంబంధిత అనుమతులు వచ్చేలా చేశారు. ఇప్పటికే రాష్ట్ర ప్రభుత్వం పోర్టు భూసేకరణకు వందకోట్లు మంజూరు చేసింది. ప్రకాశం జిల్లా గుడ్లూరు, ఉలవ పాడు మండలాల పరిధిలో 5,414 ఎకరాల భూసేకరణ లక్ష్యంగా పెట్టుకున్నారు. ఇందులో 1850 ఎకరాలు ప్రభుత్వ భూములున్నాయి. మిగతా ప్రైవేట్ భూములను సేకరించాల్సివుంది. జూలై నెలలోనే రామాయపట్నం పోర్టు పనులు మొదలయ్యే అవకాశాలున్నాయి.

అదే నెలలోనే బోగోలు మండలం జువ్వలదిన్నెలో కూడా 76.89 ఎకరా లలో మేజర్ ఫిషింగ్ హార్బర్ పనులు మొదలుకావచ్చు. 288 కోట్ల వ్యయంతో ఈ ఫిషింగ్ హార్బర్‌ను నిర్మించబోతున్నారు. అటు పోర్టు... ఇటు హార్బర్... రెండూ పూర్తయితే కావలి తీరప్రాంతం పంట పండినట్లే!

# పదిపై నీలినీడలు

- పరీక్షల నిర్వహణపై కొనసాగుతున్న సందిగ్ధం



తెలంగాణలో పదో తరగతి పరీక్షలను రద్దుచేసి అంద రినీ ఉత్తీర్ణులుగా అప్ గ్రేడ్ చేయాలని ఆ రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకోవడం తెలిసిందే! తెలంగాణ ఈ నిర్ణయం తీసుకున్నాక ఆంధ్రప్రదేశ్‌లోనూ పదో తరగతి పరీక్షల నిర్వహణపై సందిగ్ధత నెలకొంది. పదో తరగతి పరీక్షలు నిర్వహించాలా? లేక తెలంగాణలో మాదిరిగా అందరినీ పాస్ చేయాలా అన్నదానిపై చర్చలు సాగుతున్నట్లు తెలుస్తోంది. ఈమేరకు రాష్ట్ర విద్యాశాఖ మంత్రి ఆదిమూలం సురేష్ ఆదేశాలతో జిల్లాల వారీగా అధికారులు, విద్యార్థుల తల్లిదండ్రులతో పరీక్షల నిర్వహణపై అభిప్రాయ సేకరణ కూడా జరుపు తున్నట్లు సమాచారం.

మార్చిలోనే రాష్ట్రంలో పదో తరగతి పరీక్షలు నిర్వహించాల్సినప్పటికీ ఒకసారి స్థానిక ఎన్నికల కోసమని, ఇంకోసారి కరోనా వైరస్ కారణంగా వాయిదా వేశారు. లాక్‌డౌన్ ఎత్తేశాక జూలై 10 నుండి పదో తరగతి పరీక్షలు నిర్వహించేందుకు షెడ్యూల్ ఇచ్చారు.

అయితే నానాటికీ కరోనా కేసులు పెరుగుతుండడం, పరీక్షలు వ్రాయడానికే కాదు, పరీక్షల డ్యూటీలకు పోవడానికి కూడా విద్యార్థులు, వారి తల్లిదండ్రులు, అయ్యవార్లు భయపడుతున్న తరుణంలో... చెప్పిన షెడ్యూల్ ప్రకారం పది పరీక్షలు జరుగుతాయా... లేక, తెలంగాణలో మాదిరిగానే ఇక్కడ చేస్తారా అన్నది సందిగ్ధంలో వుంది.

కరోనాతో కలిసి కాపురం చేయాల్సిందే... ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలివి. ఒక్క జగనే కాదు, అమెరికా అధ్యక్షుడు నుండి అనికేపల్లి పిహెచ్‌సి డాక్టర్ వరకు చెప్పే మాటలివే! ప్రపంచంలో ఇంతవరకు పుట్టిన ఏ వైరస్ కూడా పూర్తిగా అంతం కాలేదు. మందులు, వ్యాక్సిన్‌లు వచ్చాకే వైరస్‌లను అరికట్టగలిగారు. కాబట్టి ప్రస్తుత పరిస్థితులను బట్టి చూస్తుంటే ప్రత్యేకంగా కోవిడ్ ఆసుపత్రులను ఏర్పాటు చేయాల్సిన అవసరం ఎంతైనా కనిపిస్తోంది.



### ఆ సముదాయాలనే...

# కోవిడ్ ఆసుపత్రులుగా మార్చేస్తే!

ఒకప్పుడు ప్రతి జిల్లాలో లేదా రెండు మూడు జిల్లాలకు ఒకటి చొప్పున క్షయ ఆసుపత్రులుండేవి. వ్యాక్సిన్‌లు, మందులు బాగా అందుబాటులోకి వచ్చాక క్షయ వ్యాధి అదుపులోకి వచ్చి, ఇప్పుడు టి.బి ఆసుపత్రుల అవసరం పెద్దగా లేకుండా పోయింది. అప్పట్లో పట్టణాలకు దూరంగా టి.బి ఆసు పత్రులను ఏర్పాటు చేశారు.

ఇప్పుడు చూస్తే కరోనా కేసులు కుప్పలు తెప్పలుగా వస్తున్నాయి. దీనికి వ్యాక్సిన్ గాని, మందులు గాని ఇంకా రాలేదు. అవి రావడానికి ఇంకా ఏడాది పట్టినా ఆశ్చర్యం లేదు. ప్రస్తుతానికి నెల్లూరులోని ప్రభుత్వ సర్వజన ఆసుపత్రినే కోవిడ్ ఆసుపత్రిగా కొనసాగిస్తున్నారు. ఇక్కడే కోవిడ్ సేవలు అందిస్తున్నందు వల్ల మిగతా జబ్బులకు సరైన వైద్యసేవలు అందించడం కష్టంగా వుంది. కాలక్రమంలో ఇంకా కేసులు పెరుగుతూ పోతే ఇక్కడ బెడ్‌ల కొరత ఏర్పడవచ్చు.

### హౌస్‌ఫర్ ఆల్ గృహ సముదాయాన్ని కోవిడ్ ఆసుపత్రిగా వాడొచ్చు...

కోవిడ్ పేషంట్ల కోసం పెద్దపెద్ద ఎక్విప్‌మెంట్స్, ఎక్సరే ల్యాబ్‌లు, స్కానర్లు అవసరం లేదు. డాక్టర్ల గదులు, ఐసోలేషన్ గదులు, వైరస్ నిర్ధారణ ల్యాబ్‌లు, మెడికల్ షాపులు ఏర్పాటు చేసేలా భవనాలు వుంటే చాలు. గత తెలుగుదేశం ప్రభుత్వంలో కేంద్రప్రభుత్వ సహకారంతో హౌస్‌ఫర్ ఆల్ స్కీం క్రింద నగర శివార్లలో పలు గృహ సముదాయాలు నిర్మించబడ్డాయి. అవి ఇంతవరకు లబ్దిదారులకు కేటాయించక నిరుపయోగంగా వున్నాయి.

వెంకటేశ్వరపురం, అల్లీపురం, కొండ్లపూడి ప్రాంతాలలో ఇలాంటి కొత్త గృహ సముదాయాలున్నాయి. వీటిలో ఒక దానిని కోవిడ్ ఆసు పత్రిగా మారిస్తే చాలు... ఇప్పటికిప్పుడు భవనాలు కట్టే పని లేకుండానే కోవిడ్ ఆసుపత్రి రెడీ అవుతుంది. నాయుడుపేట, మరికొన్ని ప్రాంతాలలో ఇప్పటికే ఈ భవనాలను కోవిడ్ క్వారంటైన్ కేంద్రాలుగా వాడుతున్నారు. పరిస్థితులను బట్టి అన్ని జిల్లాల్లో, ముఖ్య పట్టణాలలో ఈ గృహ సముదాయాలు అందుబాటులో వున్నాయి కాబట్టి కోవిడ్ ఆసుపత్రులుగా, క్వారంటైన్ కేంద్రాలుగా వీటిని వాడుకోవడంపై రాష్ట్ర ప్రభుత్వం దృష్టిపెట్టాలి.

### పట్నం నుండి పల్లెకు...

# సరసర పాకిన కరోనా

కరోనా వైరస్ తొలినాళ్లలో జిల్లాలో నెల్లూరు నగరం, వాకాడు, నాయుడు పేట, కోవూరు, అల్లూరు, టి.పి.గూడూరు మండలాల్లో మాత్రమే వెలుగుచూసింది. లాక్‌డౌన్ ఎత్తేసే సమయానికి జిల్లాలో దాదాపు 30 మండలాలు ఫ్రీ జోన్‌లుగా వున్నాయి. లాక్‌డౌన్ ఎత్తేశాక జిల్లాలో దాదాపు కరోనా కేసు లేదు అనే మండలమే లేకుండా పోయింది.

లాక్‌డౌన్ ఆంక్షల్లో సడలింపులు జిల్లా లోని పల్లెలు, గ్రామాల కొంపముంచాయి. ముఖ్యంగా కోయంబేడు మార్కెట్, వలస కూలీల మూలంగా గ్రామాలు, పల్లె టూర్లలో కరోనా కేసులు ఎక్కువయ్యాయి. లాక్‌డౌన్‌కు ముందు జిల్లాలో వంద కేసులు రావ డానికి చాలారోజులు పట్టింది. లాక్ డౌన్ సడలింపుల తర్వాత కేసుల వేగం పెరిగింది. ముఖ్యంగా చెన్నై కోయం బేడు లింకులతో సూళ్లూరుపేట, తడ మండ లాలలో కరోనా కేసులు గుట్టలు గుట్టలుగా పెరిగాయి. జిల్లాలో కరోనా కేసుల స్కోర్ బోర్డును పరుగెత్తించడంలో కోయంబేడుదే ప్రధానపాత్ర అని చెప్పడంలో ఆశ్చర్య పడాల్సిందేమీ లేదు.




ఇక ఆ తర్వాత చెన్నైతో పాటు ముంబై ఇతర ప్రాంతాల నుండి తమ స్వగ్రామా లకు తరలి వచ్చిన వలస కూలీలు కూడా పల్లెల్లో కేసులు పెరగడానికి తమవంతు సహకారం అందించారు. లాక్‌డౌన్‌కు ముందు ఉదయగిరి నియోజకవర్గ పరిధి లోని 8 మండలాలలో కేసులన్నవే లేవు. సడలింపుల తర్వాత బయట ప్రాంతాలలో వున్న స్థానికులు తిరిగి రావడంతో ఒక్క సారిగా ఈ మండలాలలో కేసులు విజృం భించాయి. అటు కోయంబేడు, ఇటు వలస వచ్చిన వాళ్లు... ఈ రెండు అంశాలు జిల్లాలో కరోనా కేసుల స్కోర్‌ను శర వేగంగా పెంచాయి. ఈరోజు కరోనా కేసు లేని ప్రాంతమే జిల్లాలో లేకుండా పోయింది.

## మార్చిలోగా.. సచివాలయాల నిర్మాణాలు

ముత్తుకూరు మండలంలోని అన్ని పంచాయతీల్లో కొత్తగా నిర్మించే గ్రామ సచివాలయాలను త్వరితగతిన ఏర్పాటుచేస్తామని పంచాయతిరాజ్ ఏ.ఇ సురేష్ పేర్కొన్నారు. ఈనెల 13న ఆయన మేజర్ పంచాయతీ ముత్తుకూరులో 40 లక్షల రూపాయలతో నిర్మించే సచివాలయ భవనానికి కొలతలు తీసుకున్నారు. మొత్తం 14 సచివాలయాల భవనాలు, రైతుభరోసా కేంద్రాలు, వైఎస్సార్ క్లినిక్‌లకు భవనాల నిర్మాణాలను వచ్చే మార్చిలోగా పూర్తిచేస్తామని చెప్పారు.

# ఆసుపత్రిని తలపిస్తున్న నెల్లూరు రైల్వేస్టేషన్



నెల్లూరు ప్రధాన రైల్వే స్టేషన్ ఇప్పుడు ఆసుపత్రిని తలపించేలా తయారైంది. అడుగడుగునా తనిఖీలు, మాస్క్‌లుతో, శానిటైజర్లు, సిబ్బంది పిపిఇ కిట్లు, ప్రయాణీకులకు థర్మల్ స్క్రీనింగ్, స్వాబ్ పరీక్షలు వంటి వాటితో ఇదొక హాస్పిటల్ మాదిరిగానే వుంది. లాక్‌డౌన్‌తో దాదాపు రెండు నెలల పాటు ఈ రైల్వేస్టేషన్‌లో నిశ్శబ్దం రాజ్యమేలింది. ఇటీవల సడలింపుల తర్వాత నెల్లూరు మీదుగా ఒకటి అరా రైళ్లు మాత్రమే వెళుతున్నాయి. ఆ రైళ్లలో వెళ్ళాల్సిన ప్రయాణీకులు రెండు గంటలు ముందే స్టేషన్‌కు చేరుకోవాల్సి వస్తోంది. వాళ్ళకు అన్ని పరీక్షలు నిర్వహించిన తర్వాతే రైలు ఎక్కడానికి అనుమతిస్తున్నారు. ఒకప్పుడు రైల్వేస్టేషన్‌లో ప్రయాణీకులు గుంపులుగుంపులుగా వుండే వాళ్ళు. కూర్చోవడానికి బెంచీలు కూడా చాలక నిలబడి వుండేవాళ్ళు. ఇప్పుడు దూరదూరంగా బెంచీకి ఒక ప్రయాణీకుడు కూర్చుని వుంటున్నాడు. గతంలోలాగా ఈ రైల్వేస్టేషన్‌లో నిండుగా ప్రయాణీకులు వుండడాన్ని ఇంకెన్నిరోజులకు చూస్తామో?!

# పార్టీలో చేరిన వారందరికీ సముచిత స్థానం

**- మంత్రి అనిల్ ఆధ్వర్యంలో పలువురు వైసీపిలో చేరిక**



వైసీపి పై నమ్మకంతో పార్టీలో చేరిన ప్రతి ఒక్కరికీ సముచిత స్థానం లభిస్తుందని రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి డాక్టర్ పోలుబోయిన అనిల్‌కుమార్‌యాదవ్ అన్నారు. నెల్లూరులోని ఆయన క్యాంపు కార్యాలయంలో 11వ డివిజన్‌కు చెందిన టిడిపి నేత ఆవుల శ్రీనివాసులు వైసీపి తీర్థం పుచ్చుకున్నారు. మంత్రి అనిల్‌కుమార్‌యాదవ్ శ్రీనివాసులుతో పాటు వారి అనుచరులను కండువాలతో వైసీపిలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా మంత్రి అనిల్ మాట్లాడుతూ గతంలో ఎవ్వరూ చేయని విధంగా ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతున్నారన్నారు. ప్రభుత్వం చేస్తున్న కార్యక్రమాలకు ఆకర్షితులై ఎంతో మంది వైసీపిలో చేరుతున్నారని చెప్పారు. పార్టీలో చేరిన వారందరికీ సముచిత స్థానం ఇస్తామన్నారు. ఈ కార్యక్రమంలో వైసీపి నేతలు కర్తం ప్రతాప్‌రెడ్డి, బాలకృష్ణ, పొడమేకల శ్రీనివాసులు, గిరిధర్‌రెడ్డి పాల్గొన్నారు.

# మురళీకృష్ణ పిక్‌నిక్ ఐస్‌క్రీమ్స్ ప్రారంభం



నెల్లూరు నగరం మద్రాస్ బస్టాండ్ సెంటర్ లోని మురళీకృష్ణ 70 గ్రూప్‌కు చెందిన పిక్‌నిక్ ఐస్‌క్రీమ్స్‌ను మురళీకృష్ణ హోటల్స్ వ్యవస్థాపకుడు గ్రోసు గోపాలయ్య ఈనెల 15న పునఃప్రారంభించారు. పిక్‌నిక్ ఐస్ క్రీమ్స్ డైరెక్టర్ వీరిశెట్టి హజరత్ బాబు మాట్లాడుతూ ప్రభుత్వ సూచనల మేరకు ప్రతిఒక్కరికి థర్మల్ స్క్రీనింగ్ నిర్వహించి, చేతులను శానిటైజ్ చేసి లోపలికి అనుమతిస్తున్నామని తెలిపారు. కస్టమర్లకు సరికొత్త ఐస్‌క్రీమ్స్‌ను అందిస్తున్నామన్నారు.

# అవుట్ సోర్సింగ్ ఉద్యోగులకు నిత్యావసరాలు పంపిణీ



ఫ్రెండ్స్ వాకర్స్ ఆధ్వర్యంలో నెల్లూరు ఏసీ స్టేడియంలోని అవుట్ సోర్సింగ్ ఉద్యోగులకు గౌరవ అధ్యక్షులు నలుబోలు బలరామయ్య నాయుడు అధ్యక్షతన ఈనెల 18 న నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు. కరోనా లాక్‌డౌన్ సమయంలో జీతాలు అందక ఇబ్బందులు పడుతున్నట్లు ఉద్యోగులు చెప్పిన మేరకు వారికి బియ్యం, ఫలసరుకులు,కూరగాయలు, కోడిగ్రుడ్లను ఫ్రెండ్స్ సభ్యుల సహకారంతో అందజేశారు. అధ్యక్షులు జీవీ కృష్ణయ్య, కార్యదర్శి బి. శ్రీమన్నారాయణ, కోశాధికారి వి. లక్ష్మీనారాయణ, యస్. రాఘవేంద్రప్రెట్టి, కొండూరు సుబ్బారావు, యల్.శరత్‌బాబు, సాయిసుబ్బారావు, లక్ష్మణరాజు, ఆర్. సుబ్బారావు, తిరుపతి నాయుడు, జయరామానాయుడు, కోదండరామయ్య, యతిరాజు తదితరులు పాల్గొన్నారు.

## నెల్లూరు కబుర్లు



### ఏపీ ఆర్యవైశ్య మహాసభ

# అధ్యక్షుడిగా ద్వారకానాథ్

ఆంధ్రప్రదేశ్ ఆర్యవైశ్య మహాసభ అధ్యక్షుడిగా నెల్లూరుకు చెందిన మాజీ డిప్యూటీ మేయర్, వైసిపి నాయకులు ముక్కాల ద్వారకానాథ్ ప్రమాణస్వీకారం చేశారు. ఈనెల 18వ తేదీన హైదరాబాదులోని ఆర్య వైశ్య భవన్లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన బాధ్యతలు తీసుకోవడం జరిగింది. ఈ కార్యక్రమానికి నెల్లూరు జిల్లా నుండి ఆర్యవైశ్య ప్రముఖులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. ద్వారకానాథ్‌కు రాష్ట్ర ఆర్యవైశ్య వర్గాలలో ప్రత్యేక గుర్తింపు ఉంది. ఆ వర్గం నుంచి జిల్లాలో రాజకీయంగా చురుగ్గా ఉంటున్న యువనాయకుడు ద్వారక. గతంలో నెల్లూరు అర్బన్ ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడిగా కూడా పని చేశాడు. నెల్లూరులో ఆర్యవైశ్య భవన్ నిర్మాణంలోనూ, శ్రీ కన్యకా పరమేశ్వరి దేవస్థానం పునర్నిర్మాణంలోనూ ఆయన ప్రధాన పాత్ర పోషించాడు.

# ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షలు

జూలై 11 నుండి 18వ తేదీ వరకు ఇంటర్ అడ్వాన్స్ సప్లిమెంటరీ పరీక్షలను నిర్వహిస్తున్నట్లు ఇంటర్మీడియట్ బోర్డు ప్రాంతీయ పర్యవేక్షకుడు మాల్యాద్రి చౌదరి ఒక ప్రకటనలో తెలిపారు. మొదటి, రెండో సంవత్సరం విద్యార్థులు ఒకటి నుండి ఎన్ని సబ్జెక్ట్‌లకైనా 490 రూపాయలు, అప్లికేషన్‌కు 10రూపాయలు, ప్రాక్టికల్స్ ఫెయిలై వుంటే 190 రూపాయల ఫీజును ఈ నెల 23వ తేదీలోగా చెల్లించాలన్నారు.

### ఇంటర్‌లో 'రత్నం' విద్యార్థులు

# సత్తా చాటారు

ఇంటర్మీడియట్ ఫలితాల్లో రత్నం జూనియర్ కళాశాల విద్యార్థులు తమ సత్తా చాటుకున్నారు. జూనియర్ ఇంటర్ బైపీసీ విభాగంలో సిహెచ్ శ్రీదుర్గ కావ్య, జి.మనోజ్ఞ అత్యుత్తమ మార్కులు సాధించారు. ఈనెల 12న రత్నం విద్యాసంస్థ ఛైర్మన్ కెవి రత్నం ఆ వివరాలను తెలియజేశారు. సిహెచ్ దుర్గ ఇంగ్లీష్ 95, సంస్కృతంలో 99, బోటనీలో 60, జువాలజీలో 60, ఫిజిక్స్‌లో 60, కెమిస్ట్రీలో 60 మార్కులు.. మొత్తం 440 మార్కులకుగాను 434 మార్కులు సాధించడం తమ కళాశాలకే గర్వకారణమని ఆయన సంతోషం వ్యక్తం చేశారు. అదేవిధంగా పి.సాయిచరిత ఇంగ్లీష్‌లో 95, సంస్కృతంలో 98, బోటనీ, జువాలజీ, ఫిజిక్స్‌లో 60మార్కుల వంతున సాధించి మొత్తంగా 431 మార్కులు సాధించడం జరిగిందని తెలిపారు. ఎంపిసి విభాగంలో ఎన్.పల్లవి ఇంగ్లీష్‌లో 95, సంస్కృతంలో 98, మ్యాథ్స్-1, 2లో 75మార్కులు, ఫిజిక్స్‌లో 60, కెమిస్ట్రీలో 58మార్కులతో 470 మార్కులకు గాను 460 మార్కులు సాధించి తన ప్రతిభ చాటుకుందని ఆయన తెలిపారు. అదేవిధంగా పి.దక్షితసాయి ఇంగ్లీష్‌లో 92, సంస్కృతంలో 99, మ్యాథ్స్-1, 2లో 74 మార్కులు, ఫిజిక్స్ కెమిస్ట్రీల్లో 58 మార్కులతో మొత్తంగా 470 మార్కులకు గాను 455 మార్కులు సాధించిందని చెప్పారు. వీరితో పాటు ఏవిఎస్ కావ్య 470 మార్కులకు గాను 450 మార్కులు సొంతం చేసుకుందని, కళాశాలలో అత్యధికశాతం విద్యార్థులు ఈ పరీక్షల్లో మంచి మార్కులు సాధించి ఉత్తీర్ణులు కావడం తమకెంతో ఆనందంగా ఉందని ఆయన అన్నారు.

### యాంటీ రేబిస్

# వ్యాక్సిన్ క్లినిక్ ప్రారంభం



నెల్లూరు మద్రాసు బస్టాండ్ వద్ద నున్న రెడ్‌క్రాస్ సొసైటీ ఆవరణంలోని భవనంలో యాంటీ రేబిస్ వ్యాక్సిన్ క్లినిక్‌ను రెడ్‌క్రాస్ ఛైర్మన్ చంద్రశేఖర్‌రెడ్డి ఈనెల 15న ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజల సౌకర్యార్థం పాతభవనంలోని ఏఆర్వీ క్లినిక్ రెడ్‌క్రాస్ సొసైటీ ఆవరణంలోకి మార్చినట్లు తెలిపారు. ప్రజలకు అతితక్కువ ధరకే యాంటీ రేబిస్ వ్యాక్సిన్‌ను అందజేస్తామన్నారు. భవిష్యత్తులో అనేక రకాల వ్యాధులకు వ్యాక్సిన్లను అందుబాటులోకి తీసుకొచ్చేందుకు కృషి చేస్తున్నామన్నారు. అనంతరం ఏఆర్వీ క్లినిక్ కన్వీనర్ వెంకురెడ్డిని సన్మానించారు. రెడ్‌క్రాస్ మేనేజింగ్ కమిటీ సభ్యులు రంగారావు, అంకయ్యచౌదరి, నరసారెడ్డి, ఏఆర్వీ క్లినిక్ ఉపకన్వీనర్ రమణయ్య, మేనేజర్ మస్తానయ్య, రక్తనిధి కన్వీనర్ అజయ్‌బాబు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

### ఇన్‌ఛార్జ్ పదవిపై

# 'దేశం'లో అసంతృప్తి



తెలుగుదేశం పార్టీ నెల్లూరు నగర అధ్యక్ష పదవిని కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డికి ఇవ్వడంపై మాజీమంత్రి పి.నారాయణ ముఖ్యఅనుచరుడు వేమిరెడ్డి పట్టాభిరామిరెడ్డిలో అసంతృప్తి నెలకొన్నట్లు తెలుస్తోంది. గత ఎన్నికల్లో పోటీ చేసి ఓడిపోయిన పి.నారాయణ పార్టీ నగర ఇన్‌ఛార్జ్‌గా వుంటున్నారు. ఒకవేళ ఆయన ఇన్‌ఛార్జ్ బాధ్యతల నుండి తప్పుకోవాలనుకుంటే, తన అనుచరులకు ఇప్పుకోవచ్చు, ఈ లెక్కలో ప్రధాన అనుచరుడిగా వేమిరెడ్డి పట్టాభిరామిరెడ్డి వున్నాడు. కాని కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డిని ఈ పదవి వరించింది. 15వ తేదీ జరిగిన నారాయణ జన్మదినోత్సవ వేడుకలలో పాల్గొన్న పట్టాభి ఈ విషయంలోనే తన అసంతృప్తిని బహిరంగంగా వెళ్లగక్కాడు. తాము ఇన్‌ఛార్జ్ పదవిని ఆశించామని, బాలకృష్ణ సిఫారసుతో అది కోటంరెడ్డి శీనయ్యకు పోయిందన్నట్లుగా ఆయన మాట్లాడాడు.

### అరెస్టులపై...

# కాగడాలతో నిరసన

ప్రజా ప్రతినిధులను అరెస్ట్ చేసే సందర్భంలో పాటించాల్సిన నియమ నిబంధనలను వైకాపా ప్రభుత్వం తుంగలో తొక్కిందని నెల్లూరు నగర, గ్రామీణ టిడిపి ఇన్‌ఛార్జిలు కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి, అబ్దుల్ అజీజ్‌లు ఆరోపించారు. ఈనెల 13న వారు టిడిపి నాయకుడు అచ్చెన్నాయుడు తదితరుల అరెస్ట్‌లను నిరసిస్తూ నగరంలోని వేదాయపాళెం సెంటర్‌లో కాగడాలతో నిరసన ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా అజీజ్ మాట్లాడుతూ తప్పు చేసిన వారు ఎంతటి వారైనా అరెస్ట్‌లు చేయాల్సిందేనని, అయితే రాష్ట్రంలో ప్రజాప్రతినిధులను అరెస్ట్ చేసే విధానాన్ని తప్పు పడుతున్నామని అన్నారు. గోడలు దూకి వచ్చి అరెస్టలు చేయడం ఏమిటని వారు ప్రశ్నించారు.

# కరోనాపై అప్రమత్తంగుండండి

**- జిల్లా కలెక్టర్ శేషగిరిబాబు**



జిల్లాలో కోవిడ్ – 19 కేసులు పెరుగుతున్న నేపథ్యంలో తీసుకోవాల్సిన చర్యలపై జిల్లా కలెక్టర్ ఎంవి శేషగిరిబాబు సంబంధిత అధికారులతో కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నగరంలోని ప్రభుత్వ, ప్రైవేటు వైద్యశాల్లలో అవసరమైన మందులను అందుబాటులో ఉంచుకోవాలని మరియు వెంటిలేటర్లు, ఆక్సిజన్ అందించే లైన్ల ఏర్పాట్ల చర్యలు వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ సంబంధిత అధికారులను ఆదేశించారు. డివిజన్లు వారీగా ఐసియు బెడ్‌రూంల ఏర్పాటుకు సంబంధించి సాధ్యాసాధ్యాలను అవసరమైన సిబ్బందిని, అవసరమైన మందులను వగైరాలను అందుబాటులో ఉంచే విధంగా ప్రణాళికలు సిద్ధం చేయాలని ఆయన సూచించారు. ప్రభుత్వ, ప్రైవేటు వైద్యశాల్లలో సిబ్బంది కొరత లేకుండా చర్యలు చేపట్టాలని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో సంయుక్త కలెక్టర్లు డాక్టర్ వినోద్‌కుమార్, డా. ప్రభాకర్‌రెడ్డి, ప్రభుత్వ సర్వజన ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ శ్రీహరి, అడిషనల్ డిఎం అండ్ హెచ్‌వో వరలక్ష్మి, రాజీవ్ విద్యా మిషన్ పి.డి బ్రహ్మానందరెడ్డి, కిమ్స్, అపోలో, నారాయణ వైద్యశాల ప్రతినిధులు వివిధ శాఖల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



# ఇంటర్ ఫలితాల్లో బాలికల ముందంజ

రాష్ట్ర ప్రభుత్వం ఈనెల 12న ప్రకటించిన ఇంటర్ ప్రథమ సంవత్సర పరీక్షల ఫలితాల్లో జిల్లా గత ఏడాదికంటే వెనుకబడిపోయింది. గత సంవత్సరం ప్రథమ సంవత్సరం ఫలితాల్లో రాష్ట్రంలో తృతీయ స్థానంలో నిలవగా ఇప్పుడు 5వ స్థానంలోకి వెళ్ళిపోయింది. ద్వితీయ సంవత్సర ఫలితాల్లో మాత్రం గత ఏడాది వచ్చిన 3వ స్థానాన్ని తిరిగి నిలబెట్టుకుంది. ఒకేషనల్ విభాగంలో ప్రథమ సంవత్సరంలో 53 శాతం మార్కులు సాధించి రాష్ట్రంలో ద్వితీయ స్థానంలో నిలవగా, ద్వితీయ సంవత్సర ఫలితాల్లో 73.4 శాతం మార్కులు సాధించి ప్రథమ స్థానంలో నిలవడం విశేషం. మొత్తమ్మీద ఈ ఫలితాల్లో జిల్లాలో బాలికలు ముందంజలో ఉండి అందరి అభినందనలు అందుకుంటున్నారు. బాలుర కంటే బాలికలే అధికశాతం మంది ఉత్తీర్ణత సాధించి చదువులో తాము తగ్గేది లేదని నిరూపించుకున్నారు. ప్రథమ సంవత్సరం పరీక్షలకు జిల్లాలో 14,253 మంది బాలురు హాజరు కాగా, వారిలో 8425 మంది ఉత్తీర్ణులయ్యారు. బాలికలు 14,353 మంది హాజరు కాగా 9572 మంది ఉత్తీర్ణులు కావడం విశేషం. ఇంటర్ ప్రథమ సంవత్సరంలో 63 శాతం, ద్వితీయ సంవత్సరం పరీక్షల్లో 68 శాతం ఉత్తీర్ణతలు సాధించడం జరిగింది.

ఈ సందర్భంగా ఆర్ఐఓ మాల్యాద్రి చౌదరి మాట్లాడుతూ జిల్లాలోని విద్యార్థులు మంచి మార్కులు సాధించి ఉత్తీర్ణులు కావడం ఆనందంగా ఉందన్నారు. బాలురతో పోలిస్తే బాలికల ఉత్తీర్ణత శాతం ఎక్కువగా ఉందని వారిని అభినందిస్తూ, రానున్న రోజుల్లో మరింత నాణ్యమైన ప్రమాణాలతో విద్యార్థులకు విద్యను అందిస్తామన్నారు.

# పోలీస్‌నూ వదలని కరోనా

పోలీస్ శాఖలో కరోనా కలకలం రేగింది. ఇద్దరు పోలీసు సిబ్బందికి వైరస్ సోకడంతో అప్రమత్తమైన ఉన్నతాధికారులు సిబ్బందికి కోవిడ్–19 పరీక్షలు చేయించేందుకు చర్యలు చేపట్టారు. ఇటీవల హత్యాయత్నం కేసులో ఇద్దరు నిందితులను చిన్నబజారు, వేదాయపాళెం పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్ నిమిత్తం వారిని జిల్లా కేంద్ర కారాగారానికి తరలించారు. వారికి కరోనా సోకిందని ధ్రువీకరించారు. వారితో కాంటాక్ట్ అయిన వారిని గుర్తించి కరోనా పరీక్షలు నిర్వహించాలని ఉన్నతాధికారులు ఆదేశించారు. ఈ క్రమంలో ఈనెల 15న చిన్నబజార్ పోలీస్‌స్టేషన్‌లో 56 మందికి, వేదాయపాళెంలో 65 మందికి వైద్యబృందం కరోనా పరీక్షలు నిర్వహించారు. అదేవిధంగా జైలులోని ఖైదీలు, సిబ్బందికి పరీక్షలు నిర్వహించేందుకు అధికారులు చర్యలు తీసుకున్నారు. ఈనెల 15న 120మందికి పరీక్షలు చేయించామని జిల్లా కేంద్ర కారాగార సూపరింటెండెంట్ రాజేశ్వరరావు తెలిపారు. కాగా నెల్లూరు నగరంలో ఓ ఎస్సై, ఓ కానిస్టేబుల్‌కు కరోనా పాజిటివ్ నిర్ధారణ అవడంతో వారిని ఐసోలేషన్ వార్డుకు తరలించారు. సిబ్బంది జాగ్రత్తలు పాటిస్తూ అప్రమత్తంగా విధులు నిర్వహించాలని పోలీసు ఉన్నతాధికారులు సూచించారు.

# నెల్లూరులో మోడల్ కాలనీలు

**- వెంకటేశ్వరపురం, కిసాన్ నగర్ ప్రాంతాల్లో పర్యటించిన మంత్రి అనిల్**



నెల్లూరు నగరంలో మోడల్ కాలనీలు నిర్మించనున్నామని రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి డాక్టర్ పోలుబోయిన అనిల్ కుమార్‌యాదవ్ వెల్లడించారు. 14వ తేదీ ఆయన అధికారులతో కలిసి వెంకటేశ్వరపురం, కిసాన్ నగర్ ప్రాంతాల్లో పర్యటించారు. స్థానికులను అడిగి సమస్యలు తెలుసుకున్నారు. సమస్యలు వెంటనే పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ నెల్లూరు నగరంలో మోడల్ కాలనీల నిర్మాణానికి త్వరలోనే శ్రీకారం చుట్టబోతున్నామని చెప్పారు. అందులో భాగంగా పైలెట్ ప్రాజెక్టు కింద వెంకటేశ్వరపురం, కిసాన్ నగర్ ప్రాంతాలను మోడల్ కాలనీలుగా మారుస్తామన్నారు. దీనికి సంబంధించి త్వరలోనే కోటి రూపాయల వ్యయంతో పనులు ప్రారంభిస్తామని చెప్పారు. మోడల్ కాలనీల్లో అన్నీ సదుపాయాలు ఉండే విధంగా చర్యలు చేపడుతామని ఆయా ప్రాంతాల్లో అదనంగా వార్డు సచివాలయాలు ఏర్పాటు చేస్తామన్నారు. అంతే కాకుండా దొంగతనాలకు ఆస్కారం లేకుండా ప్రతి వీధిలో సిసి కెమెరాలు ఏర్పాటు చేస్తామని మంత్రి అనిల్ పేర్కొన్నారు. ఆ ప్రాంతంలో షాదీ మంజిల్ కూడా నిర్మిస్తామని జూలైలో పనులు ప్రారంభిస్తామని చెప్పారు. ఈ పర్యటనలో మంత్రితో పాటు మాజీ డిప్యూటీ మేయర్ ముక్కాల ద్వారకానాథ్, వైసీపి నాయకులు దేవరకొండ అశోక్, పోలంరెడ్డి వెంకటేశ్వర్లురెడ్డి, నూనె మల్లిఖార్జునయాదవ్ పాల్గొన్నారు.

# స్వచ్ఛంద రక్తదానాన్ని ప్రోత్సహించాలి

**- జాయింట్ కలెక్టర్ ప్రభాకర్‌రెడ్డి**




స్వచ్ఛంద రక్తదానాన్ని ప్రోత్సహించి ప్రాణాలను కాపాడదామని జాయింట్ కలెక్టర్ ప్రభాకర్ రెడ్డి పిలుపునిచ్చారు. ఈనెల 14న ప్రపంచ రక్తదాతల దినోత్సవాన్ని పురస్కరించుకుని నెల్లూరు మద్రాస్ బస్టాండ్ వద్ద నున్న రెడ్‌క్రాస్ కార్యాలయంలో మెగా రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న జేసీ మాట్లాడుతూ రక్తదానంతో ప్రాణాలను కాపాడవచ్చన్నారు. రక్తదానంపై ప్రజల్లో వున్న అపోహలను తొలగించాలన్నారు. కరోనా కష్టకాలంలో రక్త నిల్వల ఇబ్బంది లేకుండా రక్తదానం చేసిన దాతలను అభినందించారు. రెడ్‌క్రాస్ జిల్లా ఛైర్మన్ చంద్రశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ రెడ్‌క్రాస్ సంస్థ ఆధ్వర్యంలో కరోనా కష్టకాలంలో వలస కార్మికులు, పేదలను 70 రోజులపాటు ఆదుకుని ఆహారంతో పాటు, నగదు సాయం చేశామన్నారు. అనంతరం కరోనా ఆపత్కాలంలో రోగులకు ఇబ్బంది రాకుండా పెద్దఎత్తున రక్తదాన కార్యక్రమాలు చేపట్టిన 20 మంది రక్తదాతలను జేసీ ప్రభాకరరెడ్డి చేతుల మీదుగా సన్మానించారు. బ్లడ్ బ్యాంక్ కన్వీనర్ అజయ్ బాబు, రెడ్‌క్రాస్ పాలక కమిటీ సభ్యులు, రక్తదాతలు పాల్గొన్నారు.

# కృష్ణచైతన్య ప్రతిభ

ఇటీవల ఇంటర్ బోర్డు విడుదల చేసిన ఫలితాల్లో నెల్లూరు నగరంలోని కృష్ణచైతన్య విద్యార్థులు తమ ప్రతిభను చాటుకున్నారు. జూనియర్ ఇంటర్ ఎంపిసి విభాగంలో సుమశ్రీ 470 మార్కులకు గాను 463 మార్కులు సాధించి రాష్ట్రస్థాయిలో అద్భుత ప్రతిభను కనపరిచిందని కృష్ణచైతన్య విద్యాసంస్థ డైరెక్టర్లు డాక్టర్ ఆర్‌వి కృష్ణారెడ్డి, పి. చంద్రశేఖర్‌రెడ్డి పేర్కొన్నారు. అదే విధంగా పవన్‌సాయి 462 మార్కులు, హర్షిత్, 462, గాయత్రి 461, శివప్రతాప్ రెడ్డి 460 మార్కులు సాధించారని వారు వివరించారు. బైపిసి విభాగంలో జశ్వంత్ యాదవ్ 440 మార్కులకు గాను 427 మార్కులు సాధించాడని, అనుష్నాధరెడ్డి 426, కోటేశ్వరి 425 మార్కులు సాధించారని పేర్కొన్నారు. ఎంఇసి విభాగంలో సాయి దశరథ్ 500 మార్కులకు గాను 481 మార్కులు సాధించి టాపర్‌గా నిలిచాడని, సిఇసి విభాగంలో హర్షిత 500 మార్కులకుగాను 475 మార్కులు సాధించి అత్యుత్తమ ప్రతిభను కనపరిచిందన్నారు. అన్ని గ్రూపుల్లోని కృష్ణచైతన్య విద్యార్థులు అత్యుత్తమ మార్కులతో అత్యద్భుత ఫలితాలు సాధించడం పట్ల ఆయా విద్యార్థులకు, వారి తల్లిదండ్రులకు ఫోన్ల ద్వారా తమ అభినందనలు తెలియజేశారు.

# వైసీపి అక్రమాలపై చర్యలు తీసుకోండి...

**- కలెక్టర్‌ను కోరిన అజీజ్, కోటంరెడ్డి**



అధికారాన్ని అడ్డుపెట్టుకుని వైసీపి నేతలు, ప్రజా ప్రతినిధులు అరాచకాలకు పాల్పడుతున్నారని టీడీపిని లక్ష్యంగా చేసుకుని దౌర్జన్యాలకు తెగబడుతున్నారని నెల్లూరు సిటీ, రూరల్ నియోజకవర్గాల టీడీపి ఇంఛార్జ్‌లు కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి, అబ్దుల్ అజీజ్‌లు తీవ్రంగా ఆరోపించారు. దీనిపై వారు బుధవారం ఉదయం జిల్లా కలెక్టర్‌ను కలిసి వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్రంలో వైసీపి అధికారంలోకి వచ్చినప్పటి నుండి నెల్లూరుజిల్లాలో మహిళలు, దళితులు, బీసిలపై ఎప్పుడూ లేనివిధంగా అరాచకాలు జరుగుతున్నాయని పేర్కొన్నారు. అన్యాయాన్ని ప్రశ్నిస్తే వారిపై అక్రమ కేసులు బనాయించి హింసిస్తున్నారని ఆరోపించారు. కొన్ని సందర్భాల్లో భౌతిక దాడులు కూడా చేస్తున్నారన్నారు. ఇళ్ల స్థలాల పేరుతో ఏళ్ల తరబడి నుండి సాగుచేసుకుంటున్న దళితుల భూములను అన్యాయంగా లాక్కొంటున్నారని, నెల్లూరు రూరల్‌లోని గొల్లకందుకూరులో గత ప్రభుత్వం ఎస్సీ, ఎస్టీలకు పంపిణీ చేసిన భూములను అన్యాయంగా లాక్కొన్నారని కలెక్టర్‌కు తెలియజేశారు.



## సజ్జలకు పేర్నాటి శుభాకాంక్షలు

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వ సలహాదారుడు సజ్జల రామకృష్ణారెడ్డి జన్మదినోత్సవం సందర్భంగా ఈనెల 16న తాడేపల్లిలోని ఆయన నివాసంలో జన్మదిన శుభాకాంక్షలు తెలియజేస్తున్న వైయస్ఆర్ కాంగ్రెస్ రాష్ట్ర కార్యదర్శి పేర్నాటి శ్యామ్‌ప్రసాద్‌రెడ్డి.

# గూడూరు డివిజన్ వార్తలు

### మహా నగరాలకు ధీటుగా..

# పట్టణ లేఅవుట్

- ప్రభుత్వ నిర్ణయంతో పేదలకు నెరవేరనున్న సొంత ఇంటి కల
- మునిసిపల్ ప్రజారోగ్య శాఖ ఎస్ఇ మోహన్ వెల్లడి



పేదలందరికి ఇళ్ళ పథకంలో భాగంగా ఇళ్ళస్థలాల పంపిణీ కార్యక్రమాన్ని వేగవంతంగా పూర్తిచేసేందుకు లేఅవుట్‌ల ఏర్పాటును పరిశీలించామని ప్రజారోగ్యశాఖ ఎస్ఇ మోహన్ తెలిపారు. గూడూరు పట్టణంలోని పురపాలక కార్యాలయాన్ని ఈనెల 16న ఆయన మునిసిపల్ కమిషనర్ ఓబులేసుతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇళ్ళ పట్టాల ప్రక్రియ పూర్తి కాగానే పక్కా గృహాల మంజూరు చేపడతామని తెలియజేశారు. అర్హులైన పేదలందరికీ ఇళ్ళ స్థలాలు అందించేలా చర్యలు తీసుకుంటామన్నారు. పలు అభివృద్ధి పనులపై మునిసిపల్ అధికారులతో సమీక్షించారు. ఈ కార్యక్రమంలో ఇ.ఇ వెంకటేశ్వర్లు, మునిసిపల్ అధికారులు పాల్గొన్నారు.

## సిఎం జగన్‌కు కృతజ్ఞతలు



**- యరగుడిపాటి చలపతిరావు**

ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి న్యాయవాదుల సంక్షేమం కోసం అనేకసార్లు సహాయం అందించారని, కరోనా వ్యాధి విజృంభిస్తున్న తరుణంలో న్యాయవాదులకు ప్రభుత్వం తరఫున ఆర్థిక సహాయం చేసినందుకు సిఎంకు కృతజ్ఞతలు తెలియజేస్తున్నామని గూడూరు న్యాయవాదుల సంఘం మాజీ అధ్యక్షుడు, బ్రాహ్మణసేవా సంఘం అధ్యక్షుడు యరగుడిపాటి చలపతిరావు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఆ మేరకు ఆయన సిఎంకు తన అభినందనలు తెలియజేశారు.

## కార్మికులను ప్రభుత్వాలు ఆదుకోవాలి



మాట్లాడుతున్న సిపిఎం నాయకులు

లాక్‌డౌన్ నేపథ్యంలో పనులు లేక ఇబ్బందులు పడుతున్న కార్మికుల కుటుంబాలను కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ఆదుకోవాలని కోరుతూ సిపిఎం నాయకుడు యాదగిరి ఆధ్వర్యంలో ఈనెల 16న గూడూరులోని సబ్ కలెక్టర్ కార్యాలయం వద్ద ఆందోళన నిర్వహించారు. నాయకులు పుట్టా శంకరయ్య, కేశవులు, శివకుమార్, రమణయ్య తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. అనంతరం సబ్ కలెక్టర్‌కు తమ సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని సమర్పించారు.

## అక్రమ అరెస్టులు దారుణం

**- నిరసన వ్యక్తం చేసిన మాజీ ఎమ్మెల్యే పాశం**



రాష్ట్రంలో వైకాపా ప్రభుత్వం చేస్తున్న అక్రమ అరెస్టులు దారుణమని మాజీ ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్ ఆరోపించారు. గూడూరులోని సబ్ కలెక్టర్ కార్యాలయం వద్ద తెలుగుదేశం పార్టీ నాయకులతో కలిసి ఈనెల 15న నిరసన తెలిపి, సబ్ కలెక్టర్ గోపాలకృష్ణకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మాజీమంత్రి అచ్చెన్నాయుడు అక్రమ అరెస్టు, దళిత డాక్టర్‌పై దాడి, మహిళల పట్ల వైకాపా నాయకులు అసభ్యకరమైన ప్రవర్తన వంటి చర్యలు రాజ్యాంగవిరుద్ధమని అన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు బిల్లు చెంచు రామయ్య, పులిమి శ్రీనివాసులు, కొందూరు వెంకటేశ్వర్లు రాజు, నరసింహులు, వాటంబేటి శివకుమార్, ఇజ్రాయిల్ కుమార్, గురవయ్య తదితరులు పాల్గొన్నారు.

## సాయిరాం వృద్ధాశ్రమంలో అన్నదానం



గూడూరులోని ప్రగతి సేవాసంస్థ ఆధ్వర్యంలో యమహా సుబ్రహ్మణ్యం సహకారంతో ఈనెల 15న సాయిరాం వృద్ధాశ్రమం లోని వృద్ధులకు అన్నదానం, వస్త్రదానం చేశారు. సుబ్రహ్మణ్యం పుట్టినరోజు సందర్భాన్ని పురస్కరించుకుని ఆశ్రమంలో కేకును కట్‌చేసి 20 మంది వృద్ధులకు చీరలు, 16 మందికి పంచెలు పంపిణీ చేసి అన్నదానం చేశారు. గూడూరు ఎమ్మెల్యే వెలగపల్లి వరప్రసాద్‌రావు చేతులు మీదుగా వృద్ధులకు ఈ సాయం అందజేశారు. అధ్యక్షుడు కడివేటి చంద్రశేఖర్, ఉపాధ్యక్షుడు వేమారెడ్డి సురేంద్రనాథ్‌రెడ్డి, జాయింట్ సెక్రటరీ యమహా సుబ్రహ్మణ్యం, బాలయ్యనాయుడు, గ్రానైట్ ప్రభాకర్, రామ్మోహన్‌రావు, ప్రజేంద్ర రెడ్డి, కరిముల్లా, ఉదయ్‌శేఖర్‌రెడ్డి, శ్రీనివాసులు, వాచ్‌షాప్ రాము, నిర్వాహకురాలు కల్యాణి, కోఆర్డినేటర్ సివిఆర్ న్యూస్ సతీష్ తదితరులు పాల్గొన్నారు.

## ఇస్మాయిల్‌కు నివాళులు



ఎం.ఇ.ఓ, డిప్యూటి ఇ.ఓ, విశ్రాంత ప్రధానోపాధ్యాయులు ఎం.డి ఇస్మాయిల్ ఆకస్మిక మృతికి విచారం ప్రకటిస్తూ గూడూరులో ఈనెల 13న సంతాపసభ నిర్వహించి ఆయనకు నివాళు లర్పించారు. మాజీ ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్, చేవూరు విజయమోహన్‌రెడ్డి, కడివేటి చంద్రశేఖర్, చేగువేరా అధ్యక్షుడు సురేష్, ముస్లిం వెల్ఫేర్ నెట్‌వర్క్ అధ్యక్షుడు రహీం, శ్రీకృష్ణసేవా సమితి అధ్యక్షుడు శ్యాం యాదవ్, జనవిజ్ఞాన వేదిక అధ్యక్షుడు వేగూరు రాజేంద్రప్రసాద్, ప్రగతి సేవా సంస్థ ఉపాధ్యక్షుడు వేమారెడ్డి సురేంద్రనాథ్‌రెడ్డి, లయన్స్‌క్లబ్ ఆర్‌వి రావ్, ప్రధానోపాధ్యాయుడు రవూఫ్, మోహన్‌రాజు, మమ్ముల, మేకల మస్తానయ్య, కొందూరు రామరాజు, కరిముల్లా, రిటైర్డ్ ఎంప్లాయిస్ అసోసియేషన్ సెక్రటరీ భాస్కర్‌రావు, పిట్టు వెంకటేశ్వర్లు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.



## లయన్స్‌క్లబ్ నూతన కార్యవర్గం

గూడూరు డిఎస్ఆర్ కమ్యూనిటీ హాల్ ఓపెన్ ఆడిటోరియంలో ఈనెల 14న లయన్స్‌క్లబ్ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో 2020-21 సంవత్సరానికి నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అధ్యక్షునిగా మనుబోలు రూపేష్‌రెడ్డి, కార్యదర్శిగా అందే కల్యాణ్ సాయి, పివి జగదీష్‌చంద్రలను ఎన్నుకోవడం జరిగింది. ఈ కార్యక్రమంలో గూడూరు లయన్స్ క్లబ్ బోర్డ్ ఆఫ్ డైరెక్టర్లు లయన్స్ ఎస్‌కె రియాజ్ అహ్మద్, ఎం.వి రమణయ్య, ఎం.మురళీరెడ్డి, డాక్టర్ కె.చంద్రహాస్, వాకాటి రామ్మోహన్, ఎస్‌కె మస్తాన్, రావూరు రవిచంద్ర, ఉప్పతోటి తనూజ్‌కుమార్, క్లబ్ కార్యదర్శి కడివేటి చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా రియాజ్ అహ్మద్ మాట్లాడుతూ గూడూరు లయన్స్‌క్లబ్ గత 53 సంవత్సరాలుగా శాశ్వత ప్రాతిపదికన సేవా కార్యక్రమాలు చేసి గూడూరు ప్రాంత ప్రజల మనసుల్లో సుస్థిరస్థానం ఏర్పరుచుకుందన్నారు.

## జేవివి పలసరుకులు పంపిణీ



గూడూరులోని జనవిజ్ఞానవేదిక వారి ఆధ్వర్యంలో ఇటీవల స్థానిక ఓం సాయిరాం చారిటీస్ వృద్ధుల ఆశ్రమానికి రెండు బియ్యం బస్తాలతో పాటు బ్రెడ్స్, బిస్కెట్ ప్యాకెట్లను పంపిణీ చేశారు. చేగువేరా ఫౌండేషన్ అధ్యక్షుడు మండ్ల సురేష్ ఈ సాయం వారికి అందజేశారు. ఈ సందర్భంగా సురేష్ మాట్లాడుతూ జేవివి వారు అనేక సామాజిక కార్యక్రమాలతో పాటు సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారని, లాక్‌డౌన్ విధించిన నాటినుంచి వృద్ధాశ్రమానికి ఏడవసారి సహాయం చేయడం, వలస కార్మికులకు భోజనాలు పెట్టడం, ఎస్‌టి కాలనీ వారికి సహాయ చేయడం, మునిసిపల్ కార్మికులకు, సచివాలయ సిబ్బందికి అన్ని వర్గాల వారికి తమవంతు సేవలందించం ఎంతో అభినందనీయమన్నారు. జేవివి సేవలు ఆదర్శవంతమైనవని కొనియాడారు. ఈ సేవా కార్యక్రమానికి దాతగా నిలిచిన ప్రభాకర్‌ను అభినందించారు. ఈ కార్యక్రమంలో వేగూరు రాజేంద్రప్రసాద్, మనోహర్, రామమోహన్, అశోక్, వడ్డమూడి వెంకట్, సాయికిరణ్, గోపి, శంకర్, మధు, కల్యాణి తదితరులు పాల్గొన్నారు.

## 'జగనన్న చేదోడు'పై టైలర్ల హర్షం

జగనన్న చేదోడు పథకం ద్వారా టైలర్లకు ఆర్థికసాయం చేయడం పట్ల జిల్లా టైలర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ నాయకులు హర్షం వ్యక్తం చేస్తూ రాష్ట్ర ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్‌రెడ్డికి తమ కృతజ్ఞతలు తెలియజేశారు. ఈనెల 12న నెల్లూరు నగరంలోని ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటుచేసిన సమావేశంలో టైలర్స్ అసోసియేషన్ అధ్యక్ష కార్యదర్శులు పైడా వెంకటేశ్వర్లు, ఎస్‌కె మస్తాన్‌వలీ, కోశాధికారి ఎ.నాగరాజు, సంఘం గౌరవాధ్యక్షుడు షేక్ అబ్దుల్ షుకూర్, ఉపాధ్యక్షుడు మహ్మద్ అబ్దుల్ ఖలీల్ మాట్లాడుతూ గతంలో ఏ ముఖ్యమంత్రి కూడా టైలర్ల కష్టాలను పట్టించుకోలేదని, వైఎస్ జగన్మోహన్‌రెడ్డి రాష్ట్ర ముఖ్యమంత్రి అయ్యాక తమ బాధలను తెలుసుకుని 'జగనన్న చేదోడు పథకం' కింద 10వేల రూపాయలు ఆర్థిక సాయం చేయడం ఎంతో సంతోషకరమని అన్నారు. టైలర్లను ఆదుకున్న ఏకైక సిఎం జగన్ అని వారు పేర్కొన్నారు. గత మూడు నెలలుగా లాక్‌డౌన్ నేపథ్యంలో ఎలాంటి పనులు లేక అప్పుల పాలయ్యామని, తమ కుటుంబాలు ఎన్నో అవస్థలు పడుతున్నాయని, ఇలాంటి కష్టకాలంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్ తమను ఆదుకోవడం వల్ల తమ కుటుంబాలకు కొంతమేరకు ఊరట కలిగిందని, దశలవారీగా టైలర్ల బాధలను తీర్చేందుకు ముఖ్యమంత్రి కృషి చేస్తామని హామీ ఇచ్చారని వారు ఆనందంగా చెప్పారు.

# ప్రపంచం మెచ్చిన నేత మోడీ

**- బీజేపీ నాయకులు**



దేశ ప్రధాని నరేంద్రమోడీ ప్రపంచం మెచ్చిన నాయకుడుగా ఎదిగారని జిల్లా బీజేపీ నాయకులు కొనియాడారు. ఈనెల 15న నెల్లూరులోని బీజేపీ కార్యాలయంలో విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఎమ్మెల్సీ వాకాటి నారాయణరెడ్డి, బీజేపీ రాష్ట్ర ప్రధానకార్యదర్శి సన్నపరెడ్డి సురేష్‌రెడ్డి, ఉపాధ్యక్షుడు కోటేశ్వరరావు, పార్టీ అధికార ప్రతినిధి కర్నాటి ఆంజనేయరెడ్డి, పార్టీ జిల్లా అధ్యక్షులు గుండ్లపల్లి భరత్‌కుమార్, పార్టీ మాజీఅధ్యక్షులు పి. సురేంద్రరెడ్డి పాల్గొని ప్రధాని నరేంద్ర మోడీ సందేశం, ఈ ఏడాది కాలంలో తీసుకున్న నిర్ణయాలు, అభివృద్ధి సంక్షేమ పథకాలు వివరించే కరపత్రాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దేశంలో దశాబ్దాల కాలంగా పేరుకుపోయిన సమస్యలను మోడీ ఎంతో సాహసోపేతంగా పరిష్కరించారని, ఒకే దేశం - ఒకే చట్టం, ఒకే ప్రజ... బీజేపీ నినాదమన్నారు. పాకిస్థాన్, బంగ్లాదేశ్, ఆఫ్ఘ నిస్థాన్‌లలో మతపరమైన వివక్షను ఎదుర్కొంటున్న మైనార్టీలకు భారతీయ పౌరసత్వం కల్పించడానికి చట్టసవరణ చేయడాన్ని వారు స్వాగతించారు. చొరబాటుదారులను తరిమికొట్టేలా ఎన్‌సిఆర్ చట్టాన్ని కూడా కఠినంగా అమలుచేయాల్సివుందని పేర్కొన్నారు.

## కరోనాపై ప్రజలను
# చైతన్యవంతుల్ని చేయాలి

**- బిజెవైఎం రమేష్‌నాయుడు**

కరోనా మహమ్మారి వ్యాధిపట్ల ప్రజలను జాగ్రత్తం చేయాలని, వ్యాధి వ్యాప్తిని అరికట్టేందుకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను ప్రజలకు విశదీకరించాలని భారతీయ జనతా యువమోర్చా రాష్ట్ర అధ్యక్షుడు నాగోతు రమేష్‌నాయుడు బిజెవైఎం కార్యకర్తలకు పిలుపునిచ్చారు. నెల్లూరులోని బిజెపి కార్యాలయంలో ఈనెల 13న వాత్సల్య, గీతామయి ఆశ్రమాల నిర్వాహకులకు ఆయన శానిటైజర్లు, మాస్కులు అందజేశారు. ఈ కార్యక్రమంలో బిజెపి నెల్లూరు పార్లమెంట్ నియోజకవర్గ అధ్యక్షుడు భరత్‌కుమార్, మాజీఅధ్యక్షుడు సురేంద్రరెడ్డి, బిజెవైఎం జిల్లా అధ్యక్షుడు పోలిచెర్ల ఉదయ్‌కుమార్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు కంచర్ల మురళీనాయుడు, శ్రీహరి, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

## పెంచలకోన సిబ్బందికి
# పిపిఈ కిట్లు అందజేసిన ఆనం



రాపూరు మండలంలోని పెంచలకోన దేవస్థానం సిబ్బందికి పిపిఈ కిట్లు అందజేశారు మాజీ మంత్రి, వెంకటగిరి ఎమ్మెల్యే ఆనం రామనారాయణరెడ్డి. కరోనా నేపథ్యంలో కొనసాగుతున్న లాక్‌డౌన్‌తో ఆలయాలు మూతపడటం, తర్వాత షరతులతో దర్శనాలకు అనుమతివ్వడంతో దేవస్థానాలకు భక్తులు పోటెత్తుతున్నారు. అయినా కరోనా కేసులు మాత్రం తగ్గుముఖం పట్టడం లేదు. ఈ తరుణంలో ఆలయ సిబ్బంది రక్షణ కోసం ఎమ్మెల్యే ఆనం రామనారాయణరెడ్డి పిపిఈ కిట్లు అందజేశారు. ఆదివారం నెల్లూరులోని వారి నివాసంలో ఈ కిట్లను సిబ్బందికి అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ డిప్యూటీ కమిషనర్ వెంకట సుబ్బయ్య కూడా పాల్గొన్నారు.

# మందుల దుకాణాలు కోవిడ్ నియంత్రణ పాటించాలి

నెల్లూరుజిల్లాలోని మందుల దుకాణాల వద్ద కోవిడ్ నియంత్రణ చర్యలు పాటించాలని దుకాణాల యజమానులకు జిల్లా ఔషధ నియంత్రణ పరిపాలన సహాయ సంచాలకులు వీరకుమార్ రెడ్డి సూచించారు.

నెల్లూరు బృందావనంలోని జిల్లా ఔషధ నియంత్రణ కార్యాలయంలో ఈనెల 15న ఆయన విలేకర్లతో మాట్లాడుతూ మందుల దుకాణాల వద్ద భౌతిక దూరం పాటించేలా చూడాలని, శానిటైజర్ చేసుకున్న తర్వాతనే అనుమతించాలన్నారు. మందుల ప్రిస్క్రిప్షన్‌ను రోగుల చేతిలోనే ఉంచి అవసరమైన మందులు ఇవ్వాలని, డిజిటల్ లావాదేవీలను ప్రోత్సహించాలని కోరారు. మందుల దుకాణాల యజమానులు, గుమాస్తాలు మాస్కులు, గ్లౌజులు తప్పనిసరిగా ధరించాలని సూచించారు. మందుల కొనుగోలుకు వచ్చిన వారికి కోవిడ్ లక్షణాలు ఉన్నట్లు అనుమానం వచ్చిన వెంటనే వైద్యశాఖ అధికారులకు సమాచారం అందించడంతో పాటు వివరాలను కోవిడ్-19 ఫార్మసీ యాప్‌లో నమోదు చేయాలని కోరారు.

# ఫార్మాసిస్ట్‌లకు అవకాశం కల్పించాలి

రాష్ట్ర ప్రభుత్వం నూతనంగా ఏర్పాటు చేస్తున్న విలేజ్ క్లినిక్ ల్లో ఫార్మాసిస్ట్ లకు అవకాశం కల్పించాలని ఏపీ విద్యార్థి జేఏసీ రాష్ట్ర కార్యదర్శి ఆదిత్య సాయి కోరారు. ఈనెల 15 న నెల్లూరు సుబేదారుపేటలోని వెన్నెలకంటి రాఘవయ్య భవన్ లో విలేకర్లతో మాట్లాడుతూ రాష్ట్రంలో వేలాది మంది విద్యార్థులు బీఫార్మసీ, డీఫార్మసీ, ఎంఫార్మసీ పూర్తి చేసి ఉద్యోగాలు లేక ఇబ్బందులు పడుతున్నారన్నారు. ప్రభుత్వం ఏర్పాటు చేసే విలేజ్ క్లినిక్ ల్లో ఫార్మాసిస్ట్ పోస్టులను కేటాయించి భర్తీలో ఫార్మసీ విద్యార్థులకు ప్రాధాన్యం కల్పించాలని కోరారు. విద్యార్థి జేఏసీ నాయకులు మధు, శ్రీకాంత్, సాయిరాం, రబ్బాని తదితరులు పాల్గొన్నారు.

శ్రీను గల్పిక 992

# చంద్రబాబు ఇంట వైసిపి నేతలు

"నేను ఒక్క ట్వీట్ పెడితేనే గజగజ వణికిపోతున్నారు... ఇక కోవిడ్ తర్వాత నేను ఫీల్డ్‌లోకి వస్తే మీ పరిస్థితేంటి.." ఆల్‌బకరా న్యూస్ ఛానల్‌లో వస్తున్న లోకేష్‌బాబు ప్రెస్‌మీట్‌ను చూస్తున్నాడు హైటెక్‌రత్న చంద్రబాబునాయుడు. లోకేష్‌లో ఆ కాన్ఫిడెన్స్‌కు చంద్రబాబుకు భలే ముచ్చటేసింది. ఒక్కసారిగా తన బావమరిది కమ్ వియ్యంకుడు బాలయ్య డైలాగ్‌లు గుర్తుకొచ్చాయి... "నేను రంగంలోకి దిగనంతవరకే ఏదైనా... దిగానంటే దబిడి దిబిడే" అనే బాలయ్య డైలాగ్‌ను ఆ క్షణం లోకేష్ నోటి నుండి విన్నట్లుగా వుంది చంద్రబాబుకు. లోకేష్‌లో మంచి టాలెంట్ వుంది... కాకపోతే ఆ టాలెంట్ ప్రజలకు అర్థం కావాలంటే లోకేష్ కన్నా పూర్తి స్థాయిలో తెలుగు నేర్పించాలి, లేదంటే ప్రజలకన్నా పూర్తి స్థాయిలో ఇంగ్లీష్ నేర్పించాలి అని మనసులో అనుకున్నాడు. అంతలో ఛానెల్‌లో గత ప్రభుత్వంలో ఇఎస్ఐ కుంభకోణంలో కార్మికశాఖ మంత్రిగా పనిచేసిన అచ్చెన్నాయుడును అరెస్ట్ చేయబోతున్నట్లు వార్త వచ్చింది. ఆ వెంటనే అచ్చెన్నాయుడు ప్రతిస్పందన.. ఇట్లాంటి అక్రమ అరెస్ట్‌లకు భయపడేది లేదు. ఒక అల్లూరి సీతారామరాజులా, ఒక తాండ్ర పాపారాయుడులా, మరో మేజర్ చంద్రకాంత్‌లా మీ ప్రభుత్వంతో పోరాడుతాం... జగన్మోహన్‌రెడ్డి కాస్కో అని ఛాలెంజ్ విసిరాడు. అటు లోకేష్.. ఇటు అచ్చెన్నాయుడు... ఆకారంలో గాని, మాట తీరులోగాని ఇద్దరికీ దగ్గరి దగ్గరి పోలికలున్నాయి. ఈ ధైర్యవంతులే రేపు తెలుగుదేశం పార్టీని నిలబెడుతారు. పోయిపోయి జగన్మోహన్‌రెడ్డి ఇలాంటి వీరాధివీరులతో పెట్టుకున్నాడు. ఆయనకు వీళ్ళు చుక్కలు చూపించడం ఖాయమని అనుకుంటూ మంచం మీద పడుకుని వారి గురించే ఆలోచిస్తూ నిద్రలోకి జారుకున్నాడు.

★★★★★

శ్రీకాకుళం జిల్లాలోని నిమ్మాడ గ్రామం. మాజీమంత్రి అచ్చెన్నా యుడు నివాసం. అప్పుడే కొన్ని పోలీసు వాహనాలు వచ్చాయి. అందులో నుండి ఓ వందమంది దాకా పోలీసులు దిగారు. ఆ ఇంటిని చుట్టుముట్టారు. ఈఎస్ఐ కుంభకోణం కేసులో అచ్చెన్నాయుడును అరెస్ట్ చేయబోయారు. ఆయన 'నిప్పురవ్వ' సినిమాలో బాలకృష్ణ మాదిరిగా వచ్చిన పోలీసులను చితక్కొట్టాడు. అచ్చెన్నాయుడు వందమంది పోలీసులను ఒంటిచేత్తో మట్టికరిపించాడన్న విషయం మంగళగిరి డిజిపి ఆఫీసుకు తెలిసింది. వెంటనే డిజిపి గౌతమ్ సవాంగ్ జోక్యం చేసుకుని ఈసారి వెయ్యి మంది ఏఆర్ పోలీసులను రంగంలోకి దించాడు. అచ్చెన్నాయుడును అరెస్ట్ చేయడానికి రెండు హెలికాప్టర్లలో ఆక్టోపస్ కమాండోలు కూడా దిగారు. వారి చేతుల్లో లారీల లోడింగ్‌కు వాడే పెద్దపెద్ద తాళ్ళు వున్నాయి. తనను అరెస్ట్ చేయడానికి వచ్చిన వెయ్యిమంది పోలీసులను అచ్చెన్నాయుడు గాల్లోకి ఎగరేసి కొట్టసాగాడు. అచ్చెన్నాయుడు ఒక్కడే అంతమందిని కొడుతుండడం చూసి పోలీసులు తట్టుకో లేకపోయారు. ఓ ఇద్దరు పోలీసులు వెనుకచాటుగా వచ్చి ఆయన కాళ్ళకు తాళ్ళు బిగించి విసిరారు... ఆ తాళ్ళలో కాళ్ళు ఇరుక్కుని అచ్చెన్నాయుడు కిందపడ్డాడు. వెంటనే అందరు పోలీసులు ఆయన మీద గుట్టగా పడి గొలుసులతో కాళ్ళు, చేతులు బంధించి వూర్లో గుండా నడిపిస్తూ తీసుకుపోతున్నారు. ఆయన కట్టేసిన గొలుసులతో 'వీరపాండ్య కట్టబ్రహ్మన'లా నడుస్తుంటే వూర్లో జనమంతా కూడా కన్నీళ్ళతో చూడసాగారు. అచ్చెన్నాయుడు అక్కడి ప్రజలనుద్దేశించి... ఈ పోలీసులు, ఈ జగన్ ప్రభుత్వం నన్నేమీ చేయలేదు... చంద్రబాబు అండతో ఈ సంకెళ్ళు తెంచుకుని త్వరలోనే మళ్ళీ మీ ముందుకొస్తాను అంటూ ఆయన పోలీసులు తన కోసం ప్రత్యేకంగా తెచ్చిన 28 చక్రాల లారీ ఎక్కాడు. అందరూ జయం జయం అచ్చన్నా.. జయము నీకు అచ్చన్నా అనే భజన పాట పాడుతుండగా ఆ లారీ కదిలింది.


★★★★★

హైదరాబాద్‌లోని చంద్రబాబు నివాసం. ఆయన అప్పుడే నిద్ర లేచాడు. పి.ఏ లోపలకు వచ్చి సార్ మీ కోసం విజయసాయిరెడ్డి, సజ్జల రామకృష్ణారెడ్డి, వై.వి.సుబ్బారెడ్డి, బొత్స సత్యనారాయణ, అనిల్‌కుమార్‌యాదవ్‌లు వచ్చారు. హాల్‌లో కూర్చుని వెయిట్ చేస్తున్నారని చెప్పాడు. వాళ్ళ పేర్లు వినగానే చంద్రబాబుకు ఆశ్చర్యమేసింది. ఇంత పొద్దున్నే వీళ్ళు ఎందుకొచ్చి నట్లబ్బా అని అనుకుంటూ హాల్‌లోకి వచ్చాడు. చంద్రబాబును చూడగానే వాళ్ళు నలుగురూ గౌరవంగా లేచి నమస్కరించారు. చంద్రబాబు వారికి కాఫీలు తెప్పించి, తాగాక... ఇప్పుడు చెప్పండి, ఏంటి విషయం. ఎందు కొచ్చారని చంద్రబాబు అడిగాడు. అప్పుడు విజయసాయిరెడ్డి వుండి... కోవిడ్ తర్వాత లోకేష్ ఫీల్డ్‌లోకి ఎంటర్ అవుతానంటున్నాడు, ఆయన ఫీల్డులోకి వస్తే మేం తట్టుకోవడం కష్టం... రాజకీయాలన్నాక ఎన్నో అనుకుంటుంటాం.. వాటన్నింటిని సీరియస్‌గా తీసుకుంటే ఎలా? ఆయన పెడుతున్న ట్వీట్‌ల దెబ్బకే మా అందరికీ చలి జ్వరాలొచ్చి కరోనా వచ్చిందేమోనన్న అనుమానంతో టెస్ట్‌లు కూడా చేయించుకున్నాం. అలాంటిది ఆయన నేరుగా ఫీల్డ్‌లోకి వస్తే, మా అందరికీ హార్ట్ ఎటాక్‌లే! ఇప్పుడు ఆస్పత్రుల్లో కరోనా పేషంట్లను తప్పితే మిగతావాళ్ళను చూడడం లేదు. లోకేష్‌ను ఫీల్డ్‌లోకి రాకుండా మీరే ఆపాలి... అని బ్రతిమలాడసాగాడు. అంతా విన్న చంద్రబాబు... లోకేష్ ఒక్కసారి కమిట్ అయ్యాడంటే తన మాట తానే వినడు... ఇక నా మాట ఏం వింటాడు. అయినా హార్ట్‌ఎటాక్‌లొస్తాయని చెప్పారు కదా... మానవత్వంతో చెప్పిచూస్తాలే అని హామీ ఇచ్చాడు. మీరు ఆ మాత్రం హామీ ఇస్తే చాలు మేం గుండెల మీద చెయ్యేసుకుని హాయిగా నిద్రపోతామంటూ ఆ నలుగురూ అక్కడ నుండి లేచి బయలుదేరారు. వాళ్ళు అలా వెళ్లగానే చంద్రబాబు ఆనందంతో... లోకేష్ 'నువ్వు మగాడ్రా బుజ్జీ'.. ఆ వైసిపి వాళ్ళను ఉచ్చ పోయిస్తున్నావ్... అని అరుస్తుండగా, ఆయన శరీరానికి చల్లగా ఏదో తగిలింది... టక్కున కళ్ళు తెరిచాడు... తీరా చూస్తే రాత్రి పడుకున్న మంచం మీదే వున్నాడు. ఆయన పక్కనే పడుకుని వున్న మనుమడు దేవాన్ష్ పక్క తడుపడంతో ఆ చెమ్మ చంద్రబాబుకు తగిలి మెలుకువ వచ్చింది. ఇప్పటిదాకా వచ్చింది 'కల' అని తెలుసుకుని నిట్టూర్చాడు.

అప్పుడే నిద్రమత్తులో లోకేష్ అక్కడకు వచ్చాడు. చంద్రబాబు అతనితో... కోవిడ్ తర్వాత ఫీల్డులోకి ఎంటర్ అవుతానన్నావ్‌గా... ఎంటరై వైసిపివాళ్ళతో ఏ విధంగా ఆడుకుంటావని అడిగాడు. దానికి లోకేష్.. నేను కోవిడ్ తర్వాత అని చెప్పాను... కోవిడ్ ఇప్పుడల్లా పోయేది లేదు... నేను ఎంటరయ్యేది లేదు... ఆ జగన్‌రెడ్డి చెప్పినట్లు దాంతో మనం సహజీవనం చెయ్యాల్సిందే... కాబట్టి నేను ఫీల్డ్‌లోకొచ్చే పనే లేదంటూ అక్కడనుండి వెళ్లిపోయాడు. లోకేష్ మాటలకు చంద్రబాబు అలాగే నోరు తెరిచాడు.

# కరోనాతో అల్లాడుతున్న ప్రపంచం

- ఇప్పటికే 4 లక్షలా 48వేల మందికి పైగానే బలి
- మరో 83 లక్షల మందిదాకా బాధితులు



కరోనా మహమ్మారి వ్యాధి ప్రపంచంపై తన కోరలు చాస్తూనే ఉంది. మానవాళిపై తన ప్రతాపం చూపుతూ నానాటికీ విజృంభిస్తూనే ఉంది. ఈనెల 17వ తేది దాకా ప్రపంచవ్యాప్తంగా ఈ వ్యాధి బారిన పడి ప్రాణాలు కోల్పోయిన వారి సంఖ్య 4 లక్షలా 48 వేలా 337కు చేరుకుంది. ఒక్క అమెరికాలోనే 1,19,478 మంది ఈ రాకాసి వ్యాధికి బలైపోయారు. మరో 83,34,891 మంది ఈ వ్యాధితో బాధలు పడుతున్నట్లు గణాంకాలు చెప్తున్నాయి. ఈ వ్యాధితో చనిపోతున్నవారిలో అమెరికా తర్వాత బ్రెజిల్, బ్రిటన్‌లు ఉన్నాయి. బ్రెజిల్‌లో ఇప్పటిదాకా 45,585 మంది మరణించగా, బ్రిటన్‌లో 42,153 మంది మృత్యువాత పడ్డారు. ఇటలీ, ఫ్రాన్స్, స్పెయిన్, మెక్సికో, బెల్జియం, ఇరాన్, రష్యాల్లో కూడా కరోనా మరణమృదంగం మోగిస్తూనే ఉంది. ప్రత్యేకించి భారత్‌లోనూ ఈ వ్యాధి విలయతాండవం చేస్తూనే ఉంది. ఇప్పటిదాకా మనదేశంలో ఈ మాయదారి వ్యాధితో 11,903 మంది ప్రాణాలు కోల్పోగా, 3,54,065 మంది ఈ వ్యాధి బారిన పడి విలవిల్లాడుతున్నారు. ఈనెల 17న ఒక్కరోజే 10,974 కొత్తకేసులు నమోదయ్యాయంటే కరోనా ఎంత తీవ్రంగా వ్యాపిస్తూ ఉందో అర్థమవుతుంది. దేశవ్యాప్తంగా ఈ వ్యాధినియంత్రణ చర్యలు ఎంత వేగంగా జరుగుతున్నా అంతకన్నా వేగంగా ఈ వ్యాధి విజృంభిస్తూనే ఉంది. ప్రజలు కూడా ఈ విపత్కర పరిస్థితుల్లో ఎంతో అప్రమత్తంగా ఉంటూ స్వీయనియంత్రణ పాటిస్తూ, కరోనా వైరస్ నియంత్రణకు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు సూచిస్తున్న నియమాలను తప్పనిసరిగా అమలుచేస్తూ ఈ వ్యాధి బారిన పడకుండా అందరూ తగు ముందు జాగ్రత్తలు తీసుకోవడం అత్యవసరం.

### 'విలేజ్ హెల్త్ క్లినిక్'ల ద్వారా..

## గ్రామాల్లో ప్రజలకు మెరుగైన వైద్యం

గ్రామస్థాయిలో మెరుగైన వైద్యం అందించడానికి ప్రభుత్వం చర్యలు చేపడుతోందని, విలేజ్ హెల్త్‌క్లినిక్‌ల ఏర్పాటు ద్వారా ప్రజలకు మంచి వైద్యసేవలు అందించేందుకు కృషి చేస్తోందని జేసీ ప్రభాకర్‌రెడ్డి తెలిపారు. నెల్లూరులోని కలెక్టరేట్ నుంచి ఆయన ఆర్డీఓలు, తహశీల్దార్లు, ఎంపిడిఓలు, మునిసిపల్ కమిషనర్లతో ఈనెల 17న వీడియో సమావేశం నిర్వహించారు. విలేజ్ హెల్త్ క్లినిక్‌ల నిర్మాణాలకు ప్రతి గ్రామంలో 5 నుంచి 10 సెంట్ల స్థలాన్ని వీలైనంతవరకు సచివాలయాల పక్కనే కేటాయించేలా చర్యలు తీసుకోవాలని ఆయన అధికారులకు సూచించారు. అనంతరం రేషన్‌కార్డుల పంపిణీ, నివేశన స్థలాలు తదితర విషయాలపై చర్చించారు. డిఆర్‌ఓ మల్లికార్జునతో కలసి ఈ సమావేశం నిర్వహించారు. డిఎంహెచ్‌ఓ రాజ్యలక్ష్మి, సెట్నెల్ సిఇఓ సుస్మితారెడ్డి, డ్వామా పి.డి జ్యోతి, డిపిఓ ధనలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

### బీజేపి, ఏబివిపిల ఆధ్వర్యంలో..

## వీరజవాన్లకు ఘన నివాళి



లద్దాఖ్‌లోని గాల్వన్ లోయలో చైనా సైనికులు అమానుషంగా జరిపిన దాడిలో వీరమరణం చెందిన భారత వీర జవాన్లకు ఈనెల 17న నెల్లూరు నగరంలో బీజేపి, ఏబివిపి ఆధ్వర్యంలో ఘనంగా నివాళులర్పించారు. వీరజవాన్ల మృతికి తీవ్ర విచారం వ్యక్తం చేస్తూ వాళ్ళ కుటుంబాలకు తమ ప్రగాఢ సంతాపాన్ని తెలియజేశారు. స్థానిక విఆర్‌సి సెంటర్‌లో బీజేపి ఆధ్వర్యంలో కొవ్వొత్తులతో నివాళులర్పించగా, ఏబీవిపి వారు చైనా వస్తువులను దహనం చేసి చైనా చర్యల పట్ల తమ నిరసన వ్యక్తం చేశారు. బిజేపి జిల్లా మాజీ అధ్యక్షుడు పి.సురేంద్రరెడ్డి, రాష్ట్ర అధికారప్రతినిధి కర్నాటి ఆంజనేయరెడ్డి తదితరులు పాల్గొనగా, ఏబివిపి ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ఏబివిపి రాష్ట్ర కార్యవర్గసభ్యుడు జశ్వంత్‌సింగ్, నేతలు జయంత్‌బాషా, యశ్వంత్, భానుజీత్‌జైన్, ధనుష్, హేమంత్, పవన్ పాల్గొన్నారు. నగరంలోని సంతపేటలో ఉన్న బిజెపి కార్యాలయంలో బిజెపి నాయకుడు యశ్వంత్‌సింగ్ అమరవీరుడు సంతోష్‌బాబు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. జిల్లా కలెక్టరేట్ వద్ద జరిగిన కార్యక్రమంలో బిజెపి నాయకుడు మిడతల రమేష్, బండారు సురేష్‌నాయుడు, ఏవి సుబ్బయ్య, జై శ్రీకృష్ణ బి.శ్యాంబాబు తదితరులు పాల్గొన్నారు.

# మండలిలో మంత్రుల తీరు దుర్మార్గం

**- మాజీమంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి**



ఈ నెల 17వ తేదీన శాసనమండలిలో ద్రవ్యవినిమయ బిల్లుపై జరిగిన చర్చల్లో మంత్రులు వ్యవహరించిన తీరుపై మాజీమంత్రి, టిడిపి పొలిట్‌బ్యూరో సభ్యుడు సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి తీవ్రస్థాయిలో మండిపడ్డారు. మంత్రుల వ్యవహార శైలిని ఆయన ఒక ప్రకటన ద్వారా ఖండించాడు. చట్టసభల్లో ఉమ్మడి ఏపీలోనూ ఎప్పుడూ ఇలాంటి పరిస్థితులు నెలకొనలేదని, సభ్యులు ఎంతో గౌరవంగా వ్యవహరించే వారని, వైసిపి అధికారంలోకి వచ్చాక తొలిరోజు నుంచే సభల్లో దారుణంగా ప్రవర్తించడం మొదలైందన్నాడు. నిన్న శాసనమండలిలో అధికారపార్టీ సభ్యులు, మంత్రులు వ్యవహరించిన తీరు దురదృష్టకరమని, నారా లోకేష్‌పైకి దూసుకురావడం, అడ్డుకోబోయిన బీద రవిచంద్రపై దాడి చేయడం దుర్మార్గమని, చివరకు అప్రాప్రియేషన్ బిల్లును కూడా అడ్డుకుంటారా అని ఆయన విరుచుకుపడ్డాడు. పరిపాలనలో కీలకమైన ఈ బిల్లును ప్రవేశపెట్టండి..ఆమోదిస్తామని ప్రతిపక్షమే కోరితే.. వద్దు అని ఆపిన మంత్రులను చూస్తే సభలో వారి పరిజ్ఞానానికి నవ్వాలో, ఏడ్వాలో అర్థం కావడం లేదని, సభలో మంత్రుల ప్రవర్తన చాలా ఘోరంగా వుందని, ఇప్పటికైనా మంత్రులు, అధికార పార్టీ సభ్యులు చట్టసభలకు గౌరవం తెచ్చేలా వ్యవహరించాలని ఆయన కోరాడు.

### పెరుమాళ్లపాడు ఆలయానికి..

## పూర్వవైభవం తీసుకురావాలి

**- కమలానందభారతి స్వామీజీ**

ఎన్నో ఏళ్ళ క్రితం పెన్నానది వరదలతో ఇసుకమేటల్లో కూరుకుపోయిన ప్రాచీనమైన నాగేశ్వరాలయానికి పూర్వవైభవం తీసుకురావాలని రాష్ట్ర దేవాలయాల పరిరక్షణ కమిటీ వ్యవస్థాపక అధ్యక్షుడు కమలానందభారతి స్వామీజీ అన్నారు. నెల్లూరుజిల్లా చేజర్ల మండలంలోని పెరుమాళ్ళపాడు వద్ద పెన్నానది గర్భంలో కూరుకుపోయి ఉన్న అత్యంత పురాతనమైన శ్రీ నాగేశ్వరాలయం బయల్పడడంతో ఈనెల 17న ఆయన ఈ ఆలయాన్ని చూసేందుకు వచ్చారు. ఆయనతో పాటు అర్చక పురోహిత సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు మేళ్ళచెరువు శివకుమార్ శర్మ, రాష్ట్ర పరిశ్రమల మంత్రి మేకపాటి గౌతంరెడ్డి ఓఎస్డీ చెన్నయ్య, రత్నం విద్యాసంస్థల అధినేత డా. రత్నం తదితర ప్రముఖులు ఉన్నారు. జిల్లాలోని పలు ప్రాంతాల నుంచి భక్తులు తరలివచ్చారు. పురావస్తు శాఖ అధికారులు ఈ ప్రాంతాన్ని పర్యవేక్షిస్తున్నారు. ఈ సందర్భంగా కమలానందభారతి స్వామీజీ మాట్లాడుతూ పరశురాముడు ప్రతిష్ఠించిన ఈశ్వరాలయంగా ఈ ఆలయం ఎంతో ప్రఖ్యాతిచెందినట్లు ఆలయ చరిత్రలో ఉందన్నారు. కాలక్రమేణా వరదలకు ఇసుకలో పూడుకుపోవడంతో అప్పట్లో గ్రామస్తులు రెండు కిలోమీటర్ల దూరంలో గ్రామాన్ని నిర్మించుకున్నారని, గతంలో రాజుల కాలంలో నిర్మించిన ఈ ఆలయం అనంతరం జమీందారీ కుటుంబీకులు పునర్నిర్మించారని చరిత్ర తెలియజేస్తోందన్నారు. ఈ ఆలయాన్ని యథా స్థానంలో నిర్మించేందుకు గ్రామస్తులు కృషి చేయాలన్నారు. ఓఎస్డీ చెన్నయ్య మాట్లాడుతూ పురాతన ఆలయాలను పరిరక్షించుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందని అన్నారు. మంత్రి మేకపాటి గౌతంరెడ్డి దృష్టికి ఈ విషయం తీసుకువెళ్ళి ఆలయాభి వృద్ధికి కృషిచేస్తామని చెప్పారు.

### అక్రమార్కులు ఎంతటివారైనా..

## చర్యలు తప్పవు

- జిల్లాలో ఇసుక, మద్యం అక్రమరవాణాపై ఉక్కుపాదం
- ఎస్ఇబి డిప్యూటి కమిషనర్ రాధయ్య

జిల్లాలో ఇసుక, మద్యం అక్రమరవాణాపై ఉక్కుపాదం మోపుతున్నామని, అక్రమార్కులు ఎంతటివారైనా సరే చర్యలు తప్పవని స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో(ఎస్ఇబి) డిప్యూటి కమిషనర్ వి.రాధయ్య హెచ్చరించారు. ఈనెల 17న నెల్లూరులోని తన కార్యాలయంలో ఏర్పాటుచేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ జిల్లాలో సారా తయారీ, విక్రయాలపై 14 కేసులు, నాన్‌డ్యూటీ పెయిడ్ విక్రయాలు, అక్రమరవాణాపై 15 కేసులు, మద్యం అనధికార విక్రయాలు, అక్రమరవాణా, అధికధరలకు విక్రయాలపై 192 కేసులు, అనధికార కల్లు విక్రయాలపై 8 కేసులు, ఇసుక అక్రమ రవాణా, విక్రయాలపై 30 కేసులు నమోదు చేశామని చెప్పారు. అక్రమ రవాణా, అనధికార విక్రయాలపై 94409 02243, లేదా 94409 02509 నంబర్లకు సమాచారం అందిస్తే వెంటనే స్పందిస్తామని చెప్పారు.

# ఇసుక పాలసీలో మార్పులు

**- జాయింట్ కలెక్టర్ వినోద్‌కుమార్**

అక్రమరవాణా జరగకుండా ప్రజలకు ఇసుక అందుబాటులోకి తెచ్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఇసుక పాలసీలో మార్పులు చేసిందని జిల్లా జాయింట్ కలెక్టర్ డా.వినోద్‌కుమార్ వెల్లడించారు. ఈనెల 17న కలెక్టరేట్‌లోని తన ఛాంబర్‌లో విలేకర్లతో మాట్లాడుతూ గ్రామ, వార్డు సచివాలయాల్లో మధ్యాహ్నం12 నుంచి సాయంత్రం 6 గంటల దాకా సచివాలయం డిజిటల్ అసిస్టెంట్ సహకారంతో ఇసుకను ఆన్‌లైన్లో బుక్ చేసుకోవచ్చన్నారు. బల్క్ బుకింగ్‌కు ఏపి శాండ్ పోర్టల్‌లో తమ వివరాలు రిజిస్టర్ చేసుకుంటే ఐడి ఇస్తారన్నారు. గ్రామాల్లో భవన నిర్మాణ దారులు సచివాలయంలో వివరాలు నమోదుచేసుకుని 5 కిలోమీటర్ల పరిధిలో భవన నిర్మాణానికి ఎడ్లబండిలో ఉచితంగా రవాణా చేసుకోవచ్చన్నారు. అక్రమ రవాణాను అరికట్టేందుకు రాష్ట్ర ప్రభుత్వం జాయింట్ కలెక్టర్లకు ప్రత్యేక అధికారాలను ఇచ్చిందని తెలిపారు. జిల్లాలో 7 ఇసుక రీచ్‌లు ఉన్నాయని, వర్షాకాలాన్ని దృష్టిలో పెట్టుకుని 1.50 లక్షల టన్నుల ఇసుకను నిల్వ చేసేలా చర్యలు తీసుకుంటున్నామని వివరించారు.

## రోడ్డు మ్యూజియం

**- చిన్ని నారాయణరావు**
9440202942



వాళ్ళు గుండెల్లో
అగ్నిపర్వతాల్ని దాచుకుంటూ
బ్రతుకీడుస్తున్న అర్భకులు
లావాలు ముంచెత్తినా
రోడ్డు సావిడే వారి జీవనం
చెప్పులు కుడుతూ సమయాన్ని
అతిక్రించేవాళ్ళు
గొడుగుల విల్లంబుల్ని సవరిస్తూ
అవసరాల వంతెనల్ని నిర్మించేవాళ్ళు
రోడ్డు విడిదిగా కళ్ళల్లో వత్తులేసుకుని
పేదోళ్ల షాపింగ్‌మాల్‌లు
తెరిచే దుర్బలురు
ఇప్పుడు డప్పు కొట్టినా
మన దృష్టి కెమెరాకు చిక్కవేం
ఈ మ్యూజియాలిప్పుడు
ప్రాణం పోసుకోలేదు
కడుపులు కాసారాలై
నిప్పుల సుడిగుండాల్లో మాడుతున్న
ఈ సూక్ష్మవ్యాపారం బ్రతికేదెట్లా?
వారి ఆకలి
పస్తుల్లో అవిటిదైపోయింది
లోకానికి మించిన శోకంతో
నెత్తురు చెమటయ్యింది
ఆత్మాభిమానం ఎంత చెడ్డదో
దేబిరించలేనితనం
ఎంత భయానకమో
చీకటిలో మునకలేసిన
ఈ సంసారాలను నిలిపే
వెలుగు బాణం ఎక్కడ తేను
మహాభినిష్క్రమణం స్థానే
వాళ్లది ఆత్మాభినిష్క్రమణం
కళ్ళుండీ వాళ్ళ బాధల్ని
మనసుండీ వాళ్ళ గాథల్ని
ఆలకించలేని గుడ్డితనం మనదే!..

## టచ్‌స్టోన్ ఫౌండేషన్‌చే శ్రీసిటీలో..

# గోవింద ఫుడ్స్ ప్రారంభం

### సరసమైన ధరలతో కార్పొరేట్ సంస్థలకు నాణ్యమైన ఆహారం



బెంగుళూరులోని ఇస్కాన్ అనుబంధ స్వతంత్ర సేవాసంస్థ టచ్‌స్టోన్ ఫౌండేషన్ శ్రీసిటీలోని కార్పొరేట్ సంస్థలకు ప్రతిరోజూ అల్పాహారం, మధ్యాహ్న భోజనం సరఫరా చేసేందుకు గోవింద ఫుడ్స్ పేరుతో ఈనెల 17న వంటశాలను శ్రీసిటీలో ప్రారంభించింది. అధునాతన వసతులతో ఈ కిచెన్ పనిచేయనుంది. ఇస్కాన్ స్వచ్ఛంధకార్యక్రమాలను కొనసాగించడానికి అవసరమైన నిధులను సమకూర్చే వివిధ వెంచర్లను టచ్‌స్టోన్ ఫౌండేషన్ నిర్వహిస్తోంది. అలాంటి వెంచర్లలో శ్రీసిటీలోని గోవింద ఫుడ్స్ ఒకటి. టచ్‌స్టోన్ సిఇఒ కౌంతేయ దాసాజీ, శ్రీసిటీ మేనేజింగ్ డైరెక్టర్ రవీంద్ర సన్నారెడ్డి సమక్షంలో శ్రీసిటీ డీఎస్పీ విమలకుమారి దీనిని లాంఛనంగా ప్రారంభించారు. ఈ వంటశాల ద్వారా వచ్చే ఆదాయాన్ని ఇస్కాన్‌కు చెందిన లాభాపేక్షలేని మరో అనుబంధ సంస్థ అక్షయపాత్ర నిర్వహిస్తున్న స్వచ్ఛంధసేవా పథకాలకు వినియోగించనున్నామని సిఇఒ కౌంతేయ దాసాజీ పేర్కొన్నారు. శ్రీసిటీ ఎం.డి రవీంద్ర సన్నారెడ్డి మాట్లాడుతూ కార్పొరేట్ సంస్థలకే కాకుండా శ్రీసిటీ చుట్టుపక్కల ఉన్న సామాన్యప్రజలకు కూడా సరసమైన ధరలతో పరిశుభ్రమైన, నాణ్యమైన ఆహారాన్ని సరఫరా చేయాలన్నది తమ చిరకాల కోరిక అన్నారు. గోవింద ఫుడ్స్ ప్రారంభంతో ఇక ఏ ఒక్కరూ ఆకలితో ఉండరని ఆకాంక్షిస్తున్నానన్నారు. గోవింద ఫుడ్స్ వారి సేవలను ఉపయోగించుకోవాలని ఆయన పరిశ్రమల ప్రతినిధులకు విజ్ఞప్తి చేశారు.

## డాక్టర్ జెట్టి శేషారెడ్డికి నివాళి

జిల్లాలోని పేదలకు ఉత్తమమైన రీతిలో వైద్యసేవలందించి అందరి మన్ననలు అందుకున్న ప్రజావైద్యుడు డాక్టర్ జెట్టి శేషారెడ్డి సేవలు చిరస్మరణీయమని జేఎస్ ట్రస్ట్ సభ్యులు జయరామిరెడ్డి, భోగేశ్వరరావు పేర్కొన్నారు. ఇటీవల నెల్లూరు నగరంలోని జెఎస్ విజ్ఞానకేంద్రంలో ఆయన వర్ధంతి కార్యక్రమాన్ని ట్రస్ట్ సభ్యులు నిర్వహించారు. తొలుత ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ట్రస్ట్ కమిటీ సభ్యులు నరసింహారెడ్డి, వెంకటేశ్వరరావు, జేవివి నాయకుడు కామయ్య తదితరులు పాల్గొన్నారు.

## ముందుకే..!

(మొదటి పేజీ తరువాయి)

బిల్లుకు దొడ్డిదారిన వచ్చిన మండలి సభ్యులు అడ్డుకోవడం అప్పట్లో విమర్శలకు దారితీసింది. శాసనమండలి అన్నది ప్రభుత్వ విధానాలలో భాగంగా వుండాలేగాని, ప్రతిబంధకం కాకూడదనే ఉద్దేశ్యంతో అప్పుడే రాష్ట్ర ప్రభుత్వం శాసన మండలిని రద్దు చేస్తూ, అసెంబ్లీలో చేసిన తీర్మానాన్ని కేంద్రప్రభుత్వానికి పంపడం జరిగింది. కేంద్రం వద్ద ఇంకా ఆ బిల్లుపై ఆమోదముద్ర పడకపోవడంతో రాష్ట్రంలో ఇంకా శాసనమండలి కొనసాగుతోంది.

ఈ నెల 16, 17 తేదీలలో రెండురోజుల పాటు నిర్వహించిన బడ్జెట్ సమావేశాలలో ప్రభుత్వం మరోసారి సిఆర్‌డిఏ రద్దు బిల్లు, మూడు రాజధానుల బిల్లును శాసనసభలో ప్రవేశపెట్టి ఆమోదింపజేసింది. ప్రతిపక్ష నేత చంద్రబాబు ఎంతగా అడ్డుకోవాలని చూస్తున్నా ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్‌రెడ్డి మూడు రాజధానుల నిర్ణయంపై ముందడుగే వేస్తున్నాడు. ఈమేరకు కార్యనిర్వాహక రాజధానిలో అవసరమైన భూసేకరణ, ఇతర వసతుల కొరకు బడ్జెట్‌లో నిధులు కూడా కేటాయించారు. ఆరునూరైనా ఇక మూడు రాజధానుల విషయంలో జగన్ వెనుకడుగేసే ప్రసక్తే లేదు... త్వరలోనే అమరావతి నుండి విశాఖకు పరిపాలనా రాజధానిని మార్చినా ఆశ్చర్యపోవాల్సిందేమీ లేదు.

### కుల రాజధాని కోటలు కూలుతాయా?

2014లో అధికారంలోకి వచ్చిన చంద్రబాబు అమరావతి ప్రాంతాన్ని రాజధానిగా ఎంచుకున్నాడు. ఇక్కడ అద్భుతమైన రాజధానిని నిర్మించాలంటూ పాతిక దేశాలకుపైగానే తిరిగి డిజైన్‌లకు, గ్రాఫిక్స్‌కు వందల కోట్లు తగలేశాడు. రాజధాని పేరుతో దాదాపు 40వేల ఎకరాలు మంచి మాగాణి పొలాలను నాశనం చేయాలని చూశాడు. రాజధాని ముసుగులో సిఆర్‌డిఏ పేరుతో పెద్ద ఎత్తున రియల్ ఎస్టేట్ వ్యాపారం నడపాలని చూశాడు. కాని 2019 ఎన్నికల్లో ఓడిపోవడం, ప్రస్తుత ముఖ్యమంత్రి అభివృద్ధి వికేంద్రీకరణ లక్ష్యంతో మూడు రాజధానుల దిశగా కదులుతుండడంతో బాబు 'కుల' కల రాజధాని సౌధాలు కూలుతున్నాయి.

# సరిహద్దుల్లో సమరనాదం

*ప్రపంచంలోనే అత్యంత శాంతి కాముక దేశం భారత్. వందల ఏళ్ళ చరిత్రలో ఈ దేశం ఏ దేశాన్నీ ఆక్రమించుకోలేదు. ఏ దేశ భూభాగాన్నీ కావాలనుకోలేదు. ఏ దేశంపై కూడా యుద్ధానికి దిగాలనుకోలేదు. తన సరిహద్దులను కాపాడుకుంటూ, తన సార్వభౌమత్వాన్ని నిలబెట్టుకుంటూ ప్రపంచంలో ఆదర్శంగా, ఒక పెద్ద మనిషి పాత్ర పోషిస్తున్న దేశం భారత్. అభివృద్ధిలో వెనుకబడిన దేశం స్థాయి నుండి అన్ని దేశాలు గౌరవించే స్థాయికి చేరుకున్న దేశం.*

- విషం కక్కిన డ్రాగన్
- అదును చూసి దొంగ దెబ్బ
- ధైర్యంగా ప్రతిఘటించిన ఇండియన్ ఆర్మీ
- మృత వీరుల్లో తెలుగువాడు కల్నల్ సంతోష్



మరి భారతదేశం అంటే ఎందుకో... చైనాకు ఎప్పుడూ కంటగింపుగానే వుంటుంది. భారత్‌తో పాకిస్థాన్‌కు పడదు అంటే, దానికి కారణాలున్నాయి. కాశ్మీర్ విషయంతో పాటు మతపరమైన బేధాలు కూడా మనపై అక్కసు పెంచుకునేలా చేశాయి. ఇక ఇప్పుడు పాకిస్థాన్ కంటే చైనానే మనకు పక్కలో బల్లెంలా మారింది. ఈ తగవులమారి చైనా భారత్‌తో కోరి తగవు పెట్టుకోవాలనుకుంటోంది. ముఖ్యంగా అన్ని దేశాలు చైనా వదిలిన కరోనా వైరస్‌తో యుద్ధం చేస్తున్నాయి. భారత్ కూడా అదే పనిలో మునిగివున్న తరుణంలో చైనా భారత్‌పై దొంగదెబ్బకు పాల్పడింది. ఈనెల 15వ తేదీన ఇరు దేశాల సరిహద్దుల్లో గల గాల్వాన్ లోయలో భారత భూభాగంలోకి చొచ్చుకు వచ్చిన చైనా ఆర్మీ భారత సైనికులపై రాడ్‌లు, రాళ్ళు, ఇనుపతీగలు అల్లిన కర్రలతో అకస్మాత్తుగా దాడి చేసిన సంఘటనలో 20 మంది సైనికులు వీరమరణం పొందారు. భారత సైనికులు కూడా ప్రతిదాడికి పాల్పడడంతో అటువైపు కూడా ప్రాణనష్టం జరిగినట్లు తెలుస్తోంది.

గత కొన్ని రోజులుగా సరిహద్దులో లద్దాఖ్, గాల్వాన్‌లలో చైనా ఆర్మీ కదలికలు ఎక్కువయ్యాయి. సరిహద్దులో భారీఎత్తున సైన్యాన్ని దించింది. అందుకు ప్రతిగా భారత్ కూడా భారీగా సైనిక దళాలను మోహరింపజేయడంతో సరిహద్దులో సమర వాతావరణం నెలకొంది. కొంత కాలం క్రితం లద్దాఖ్ వద్ద ఇరు దేశాల సైనికులు గొడవకు దిగడం, కొందరు గాయపడడం జరిగింది. అంతకుముందు డోక్లాంలోనే ఇరు దేశాల సైనికులు బాహాబాహీకి దిగారు.

సరిహద్దుల్లో ఉద్రిక్తతలను నివారించే క్రమంలో ఇరు దేశాల నుండి లెఫ్టినెంట్ జనరల్, మేజర్ స్థాయి అధికారుల సమావేశం జరగడం.. రెండు వైపుల నుండి కూడా సైనికులు వెనక్కి తగ్గాలని నిర్ణయించడం జరిగాయి. ఇలా ఇరు దేశ సైనికులు వెనక్కి వస్తున్న క్రమంలోనే గాల్వాన్ లోయ ప్రాంతంలో భారత సైనికులపై చైనా ఆర్మీ అకస్మాత్తుగా దాడికి దిగి దొంగదెబ్బ తీసింది.

ఈ సంఘటనతో సరిహద్దుల్లో మరోసారి యుద్ధవాతావరణం నెలకొన్నట్లయ్యింది. సంఘటనపై భారత ప్రభుత్వం అప్రమత్తమై, చైనా సరిహద్దు వెంట భారీగా సైన్యాన్ని మోహరించింది. ప్రధాని నరేంద్ర మోడీ కేంద్ర రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్‌లు త్రివిధ దళాధిపతులతో సమావేశమై పరిస్థితిని సమీక్షిస్తున్నారు.

చైనా, భారత్‌ల మధ్య 3500 కిలోమీటర్ల సరిహద్దు ప్రాంతం వుంది. 1962లో ఇరు దేశాల మధ్య యుద్ధం జరిగింది. అప్పటి నుండి ఇప్పటిదాకా కొన్ని సరిహద్దు ప్రాంతాల విషయంలో వివాదాలున్నాయి. అయినా కూడా కాల్పులకు దిగకుండా చర్చల ద్వారా వివాదాలను పరిష్కరించుకోవాలని ఇరు దేశాలు నిర్ణయించుకున్నాయి. దాదాపు 45 ఏళ్లుగా ఆ నిర్ణయానికే కట్టుబడి వున్నాయి.

అయితే గత కొన్నేళ్లుగా భారత సరిహద్దుల వైపు చైనా రోడ్లు, రైలు మార్గాలు నిర్మించడం మొదలుపెట్టింది. సైనిక దళాలనూ పెంచ సాగింది. పిఓకె లోనూ కారిడార్ మొదలుపెట్టింది. ఇవన్నీ భారత్ వ్యతిరేక చర్యలే! యూపిఏ హయాంలో చైనా చర్యలపై ప్రతిస్పందన లేదు. కాని, కేంద్రంలో ఎన్డీఏ ప్రభుత్వం వచ్చాక చైనాకు ధీటుగా సరిహద్దులో మౌలిక సదుపాయాలు ఏర్పాటు చేయసాగారు. సైనికులు చేరడానికి వీలుగా రోడ్ల నిర్మాణం, వంతెనల నిర్మాణం, ఎయిర్ స్ట్రిప్‌లు ఏర్పాటు చేయడం వంటివి మొదలుపెట్టారు. భారత్ వైపు నుండి ఈ చర్యలను చైనా ఓర్చుకోలేకపోతోంది. అదీగాక కరోనా వైరస్ ప్రబలాక ప్రపంచ దేశాలన్నీ చైనాను వెలివేస్తూ భారత్‌కు ప్రాధాన్యతనివ్వడాన్ని కూడా ఆ దేశం సహించలేకపోతోంది. భారత్ తమకు ఎక్కడ ఆర్థిక శక్తిగా పోటీ వస్తుందోనేభయంతోనే ఓపక్క పాకిస్థాన్‌ను, ఇంకో పక్క నేపాల్‌ను భారత్‌కు వ్యతిరేకంగా ఉసిగొల్పడమే కాకుండా భారత్‌తో నేరుగానే కయ్యానికి కాలు దువ్వుతోంది.

## ఇక.. ఆగదు ఆట

(మొదటి పేజీ తరువాయి)

బస్సు ప్రమాదానికి గురై 13మంది దాకా చనిపోయారు. ఆ సమయంలో ప్రతిపక్ష నేతగా వున్న వైయస్ జగన్మోహన్‌రెడ్డి సంఘటనా స్థలానికి వెళ్లడం, ఆసుపత్రిలో క్షతగాత్రులను పరామర్శించడమే కాకుండా ప్రమాదానికి కారణమైన ట్రావెల్స్ సంస్థపై విచారణకు డిమాండ్ చేశారు. జగన్ అలా డిమాండ్ చేయడాన్ని జేసీ సోదరులు సహించలేకపోయారు. జేసీ సోదరులలో ఒక్కడైన జేసీ ప్రభాకర్‌రెడ్డి అనంతపురంలో 'సాక్షి' కార్యాలయం ఎదుట కూర్చొని మాటల్లో చెప్పలేని విధంగా, చేతుల్తో రాయలేని విధంగా జగన్‌ను బూతులు తిట్టడం సభ్య సమాజం మరచిపోలేదు. ఆరోజు జగన్‌పై బండబూతులు తిట్టిన జేసీ ప్రభాకర్‌రెడ్డిని ఈరోజు జైలు ఊచల వెనుక చూసి జగన్ అభిమానులు ఎంత గానో సంతోషపడుతున్నారు.

### ఆట ఇప్పుడే మొదలు..

అధికారంలోకి వచ్చిన తర్వాత ఏడాదిదాకా ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్‌రెడ్డి గత తెలుగుదేశం ప్రభుత్వ అక్రమాలను పట్టించుకోలేదు... ఏడాది దాటగానే వేట మొదలుపెట్టాడు. అచ్చెన్నాయుడు, జేసీ ప్రభాకర్‌రెడ్డిలతో మొదలైన ఈ వేట... ఇంకెంతమందిని జైలుకు పంపిస్తుందో చూడాలి! చంద్రబాబు ఐదేళ్ళ పాలనలో ప్రతిదీ అక్రమం, అవినీతే! ఇరిగేషన్‌లో వందలకోట్ల కుంభకోణం... మైనింగ్ మాఫియా... సిఆర్‌డిఏ స్కాం.. భూముల మాఫియా, డేటా చోరీ... లెక్కలేనన్ని అంశాలలో లెక్కలు తేల్చాల్సివుంది... వీటన్నింటి లెక్కలు తేలితే గత తెలుగుదేశం ప్రభుత్వంలో అధికార గర్వంతో విర్రవీగిన వాళ్ళు చాలామందికి పోలీసు మర్యాదలు తప్పకపోవచ్చు.

### బాబు గుండెల్లో దడ

అచ్చెన్నాయుడు, జెసి ప్రభాకర్‌రెడ్డిల అరెస్ట్‌తోటే చంద్రబాబు అండ్ కోలో వణుకు మొదలైంది. ఇఎస్ఐ స్కాం జరిగిందా? లేదా? అనేదానిని చర్చించకుండా చంద్రబాబు బిసి కార్డు వాడుతూ అచ్చెన్నాయుడును అక్రమంగా అరెస్ట్ చేశారంటూ వాపోతున్నాడు. అయితే అదే సమయంలో 'రెడ్డి' వర్గానికి చెందిన జేసీ ప్రభాకర్‌రెడ్డి అరెస్ట్ కూడా జరిగిపోవడంతో చంద్రబాబు కులపాచిక పారలేదు. అంతేగాక, ఇతర పక్షాలు కూడా అవినీతి కేసుల్లో ప్రభుత్వ చర్యలను సమర్ధించడంతో బాబు నోట్లో పచ్చి వెలక్కాయ పడ్డట్లయ్యింది. జగన్ ఇదే వూపుతో వేటను కొనసాగిస్తే, గత తెలుగుదేశం ప్రభుత్వ అవినీతి పునాదులను పెకిలిస్తూపోతే ఇది ఎంతమంది అరెస్ట్ దాకా పోతుందో, ఎంత పెద్ద తలకాయల అరెస్ట్ దాకా పోతుందో అంతు చిక్కని పరిస్థితి. ప్రస్తుతానికి టిడిపి నేతలకు సినిమా మొదలైనట్లే! ముగింపు ఎలా వుంటుందో ఆసక్తికరమే!

# పెన్నమ్మ గర్భంలో.. శివయ్య





- పెరుమాళ్ళపాడు వద్ద పెన్నానదిలో బయటపడ్డ 200 ఏళ్ళ నాటి నాగేశ్వరాలయం
- 70 ఏళ్ళ క్రితం పూడిపోయి.. ఇప్పుడు బయల్పడిందంటున్న స్థానికులు

*సుమారు ఏడు దశాబ్దాల క్రితం పెన్నానది తీరంలో ఇసుక మేటల్లో కూరుకుపోయిన ప్రాచీనమైన నాగేశ్వరాలయం ఇప్పుడు తవ్వకాల్లో బయటపడడంతో ఆ ప్రాంతంలోని గ్రామస్తులంతా ఆశ్చర్యపోతున్నారు. ఎప్పుడో పూడిపోయి కనుమరుగై పోయిందనుకున్న ఈ ఆలయం ఇంతకాలానికి మళ్ళీ కనపడడంతో వారి ఆనందానికి అంతే లేదు. దేవాదాయ శాఖకు సమాచారం ఇచ్చి చేపట్టిన తవ్వకాల్లో లభించిన ఆనవాళ్లను బట్టి ఈ ఆలయం సుమారు రెండువందల సంవత్సరాల క్రితం నాటిదని గ్రామస్తులు అంటున్నారు. చేజర్ల మండలం పెరుమాళ్లపాడు గ్రామంలో ఈ ఆలయం బయల్పడడం సంచలనం కలిగించింది.*

చేజర్ల మండలంలోని పెరుమాళ్ళ పాడు గ్రామంలో పెన్నానది తీరంలో ఈనెల 16న బయల్పడిన విషయమిది. ఎప్పుడో సుమారు 2 వందల సంవత్సరాల క్రితం నిర్మించినట్లు చెప్తున్న ప్రాచీనమైన నాగేశ్వరాలయం అప్పట్లో పెరమనపాడు అని పిలిచే పెరుమాళ్ళపాడు గ్రామంలో ఉండేదని, ఈ ఆలయంలో అప్పట్లో నిత్య పూజలు జరుగుతుండేవని గ్రామస్తులు చెప్తున్నారు. 70 ఏళ్ళ క్రితం పెన్నానదికి భారీ వరదలు వచ్చినప్పుడు ఇసుకమేటలు పడి ఈ ఆలయం క్రమేణా పూడిపోయిందని, తమ గ్రామం కూడా నదికి సుమారు రెండు కిలోమీటర్ల దూరంలో నిర్మితమైందని స్థానిక పెద్దలు పేర్కొంటున్నారు. కాలక్రమంలో ఈ ఆలయం కనుమరుగై పోయిందని వారు తెలిపారు. ఈ నేపథ్యంలో లాక్‌డౌన్‌తో స్వగ్రామానికి వచ్చిన అక్కడి యువకులు కొందరు ఈ విషయం వృద్ధుల ద్వారా తెలుసుకుని కొత్తగా అనుమతులు లభించిన ఇసుక రీచ్‌కు దగ్గరలోనే ఈ ఆలయం ఉండి ఉండవచ్చని ఊహించి సంబంధిత కాంట్రాక్టర్ దృష్టికి తీసుకువచ్చారు. కాంట్రాక్టర్ శ్రీనివాసచౌదరి సహకారంతో జేసీబీ యంత్రాలతో ఆ యువకుల ఆధ్వర్యంలో పెన్నానదిలో తవ్వకాలు జరపగా ఆలయ ఆనవాళ్ళు బయటపడ్డాయి. ఆలయ శిఖరం, గర్భగుడి, ముఖమండపాలు వెలుగులోకి వచ్చాయి. శివాలయం బయటపడిన విషయం తెలుసుకుని గ్రామస్తులంతా పెద్ద ఎత్తున అక్కడికి తరలివచ్చి కొబ్బరికాయలు కొట్టారు. ఈ గుడిని చూడడానికి భారీ సంఖ్యలో భక్తులు తరలివస్తున్నారు.

పురావస్తుశాఖ వారి అనుమతులు తీసుకుని దాతల సహకారంతో ఆ ఆలయాన్ని పునర్నిర్మించేందుకు సన్నాహాలు చేస్తున్నారు. ఈ విషయాన్ని మంత్రి గౌతం రెడ్డి దృష్టికి తెచ్చి ఈ ఆలయాన్ని పునర్నిర్మించాలనుకుంటున్నారు.

## డెబ్బై ఏళ్ళ క్రితం పూజలు చేశాం...

**– కె.వి.రత్నం, రత్నం విద్యా సంస్థలు**



పెన్నా నది ఒడ్డున ఉన్న పెరుమాళ్ళపాడులోని నాగేశ్వరాలయం పరశురాముడు ప్రతిష్టించినట్లు పెద్దలు చెప్పారు. అక్కడికి రెండు కిలోమీటర్ల దూరంలో ఉన్న చెల్లపనాయుడుపల్లి మా స్వగ్రామం. నా చిన్నతనంలో 8ఏళ్ళ వయసులో మా తండ్రిగారితో కలిసి వెళ్లి ఆ గుడిలో పూజలు నిర్వహించాం. ఇసుక తుఫాన్ వల్ల కాలక్రమంలో ఈ ఆలయం కనుమరుగైంది. అయితే, ఎప్పుడో ఒకప్పుడు ఈ ఆలయం బయటపడుతుందని మా సతీమణితో అంటుండేవాడిని, కానీ ఇంత తొందరగా ఆలయాన్ని తిరిగి చూస్తానని అనుకోలేదు. 70ఏళ్ళ క్రితం చూసిన ఆలయాన్ని, ఇప్పుడు 78ఏళ్ళ వయస్సులో తిరిగి చూసే సరికి నా ఆనందానికి అవధులు లేకుండాపోయాయి. ఈ ఆలయాన్ని తిరిగి తెరిపించి, శివలింగాన్ని పునః ప్రతిష్టించి పూజలు జరిగేలా చర్యలు తీసుకోవాలి.

### యోగా బ్రోచర్‌ను ఆవిష్కరించిన

## విపిఆర్ దంపతులు



6వ అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని ఈనెల 21న ఎంపి వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, తిరుమల తిరుపతి దేవస్థానాల పాలకమండలి సభ్యురాలు శ్రీమతి వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డిల ఆధ్వర్యంలో నెల్లూరు జిల్లా యోగా క్రీడా అసోసియేషన్ ముందస్తు వేడుకలు జరిగాయి. ఈ సందర్భంగా వేమిరెడ్డి దంపతులు యోగా దినోత్సవం బ్రోచర్‌ను ఆవిష్కరించారు. ఎంపి కార్యాలయంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఎంపి వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి మాట్లాడుతూ ఆరోగ్యానికి యోగా ఎంతో మంచిదన్నారు. కరోనా నేపథ్యంలో యోగా దినోత్సవాన్ని సామూహికంగా జరుపుకోలేం కనుక ప్రతి ఒక్కరూ తమ ఇళ్ళ నుంచే యోగా చేయాలని, ఆదివారం ఉదయం 7 గంటల నుంచి 7.45 దాకా టీవీలో, లేదా సామాజిక మాధ్యమాల్లో ప్రత్యక్ష ప్రసారాలను అనుసరించి యోగా చేయవచ్చని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా యోగా క్రీడా అసోసియేషన్ అధ్యక్షుడు నిర్మల నరసింహారెడ్డి, కార్యదర్శి ప్రసన్నకుమార్, ఉపాధ్యక్షుడు రమణారెడ్డి, స్వప్న, కోశాధికారి చంద్రమల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.




సింహపురీయుల సేవకై పునఃప్రారంభం

BUY 500 ml ICE CREAM
GET
125 ml ICE CREAM
FREE
( LIMITED OFFER )




500 మి.లీ. ఐస్‌క్రీమ్ కొనండి..
125 మి.లీ. ఐస్‌క్రీమ్
ఉచితంగా పొందండి
( ఆఫర్ ఉన్నంత వరకు మాత్రమే )
☛ పార్శిల్స్‌పై మాత్రమే

అధునాతన వసతులతో సరికొత్త హంగులతో ముస్తాబై, ప్రభుత్వ సూచనలను పాటిస్తూ.. నెల్లూరు మద్రాసు బస్టాండు వద్ద గల మా "మురళీకృష్ణ 70 గ్రూప్"
పికనిక్ ఐస్‌క్రీమ్స్
పునఃప్రారంభమయిన శుభవేళ...
ఆత్మీయ కస్టమర్ల దేవుళ్ళకు
హృదయపూర్వక స్వాగతం
తెలియజేస్తూ...



గ్రోసు గోపాలయ్య
వ్యవస్థాపకులు, మురళీకృష్ణ 70 గ్రూప్,
నెల్లూరు.

అధునాతన గృహోపకరణాలకు చిరునామా
అమ్మ ఫర్నిచర్ మాల్
మినీబైపాస్‌రోడ్, నెల్లూరు.
Latest & New Models
ప్రతి కొనుగోలు పై డిస్కౌంట్ కలదు

Edited, Published, Printed & Owned by **THUNGA SIVAPRABHATH REDDY**, Plot no:1&2, Main Road, Magunta Layout, NELLORE-524003. Printed & Published at **Roopa Graphics**, Plot no:1&2, Main Road, Magunta Layout, NELLORE-524003. Ph:2323485. Editor-**THUNGA SIVAPRABHATH REDDY,** Executive Editor-**G.SREENIVASULU REDDY**. e-mail: roopagroup@yahoo.com